ప్రజాశక్తి
శనివారం 1 మార్చి 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉమ్మడి విశాఖకు నిరాశే..

- మెట్రో రైలు ఊసే లేదు
- విశాఖ ఫ్లై ఓవర్లపై కన్నెత్తి చూడలేదు
- స్టార్టప్‌లకు అరకొర కేటాయింపులే
- మత్స్యకార భరోసా పెంచినా నిబంధనల దడ
- సాగునీటి ప్రాజెక్టులకు నామమాత్రపు కేటాయింపులు
- ఏజెన్సీకి సాయం కరువు
- రాష్ట్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/అనకాపల్లి ప్రతినిధి

శుక్రవారం ఉదయం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ - 2025 ఉమ్మడి విశాఖను తీవ్ర నిరాశ పరిచింది. తాజా బడ్జెట్‌లో విశాఖకు సంబంధించి మెట్రో రైలు, ఫ్లైఓవర్లు, ఐటి సెక్టార్ వంటివాటికి, అనకాపల్లి జిల్లాలో తాగునీటి ప్రాజెక్టులకు, అల్లూరి జిల్లాలో గిరిజనుల సంక్షేమానికి ఏమాత్రమూ చర్యలు కానరాలేదు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అద్భుత బడ్జెట్ అంటూ దీన్ని పేర్కొనగా పలువురు ఈ బడ్జెట్‌పై పెదవి విరుస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బడ్జెట్‌గా దీన్ని పేర్కొంటున్నారు.

విశాఖ జిల్లాకు అశనిపాతంలా ఈ బడ్జెట్ మారింది. అన్ని పథకాలనూ కలగలిపేసి అరకొర సంక్షేమంతో నెట్టుకు రావాలన్న ఆలోచనతో కూటమి ప్రభుత్వం అడుగులేయడం స్పష్టంగా కనిపించింది. ఐటి రంగానికి రాష్ట్రంలో రూ.300 కోట్లు కేటాయించినప్పటికీ ఎంత విడుదలౌతుందో ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. అలాగే రాష్ట్రంలోని స్టార్టప్ కంపెనీల నుంచి రూ.100 కోట్లు డిమాండ్ ఉండగా కేవలం రూ.60 కోట్లతో సరిపెట్టుకోవాలని బడ్జెట్‌లో ప్రతిపాదించడంతో కొత్తగా ఏర్పాటు చేయబోయే ఐటి స్టార్టప్ ఎంటర్‌ప్రూనర్స్‌ను నిరాశ పరిచినట్టయింది. ఇవి కేటాయింపులే అయినందున ఆచరణలో మంజూరు, విడుదల మాటేమిటో అంటూ ఆ రంగానికి చెందినవారు పెదవి విరుస్తున్నారు.

విశాఖకు అత్యంత కీలకమైన ఫ్లై ఓవర్ బ్రిడ్జ్‌ల నిర్మాణం, మెట్రో రైలు ప్రతిపాదనలపై కదలిక ఈ బడ్జెట్‌లో ఎక్కడా కానరాలేదు. ఇవి కేంద్రం, జాతీయ రహదారుల అభివృద్ధి అథారిటీతో అనుసంధానమైన ప్రాజెక్టులే అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వీటికి ఏ మేరకు ప్రాధాన్యం ఇవ్వనుందో ఈ బడ్జెట్‌లో లేకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

మత్స్యకార భరోసా పెంచినా.. ఎక్కడో ఆందోళన

గత ప్రభుత్వంలో మత్స్యకారుల వేట నిషేధ సమయంలో ప్రభుత్వం రూ.10 వేలను కుటుంబానికి సాయంగా అందజేసేది. తాజా బడ్జెట్‌లో కూటమి సర్కారు దీన్ని రూ.20 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంత మిగతా 2లో..

ప్రజల ఆశలపై నీళ్లు

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు అనకాపల్లి జిల్లా అభివద్ధికి దోహదపడేలా లేవు. రూ.17 వేల కోట్ల విలువైన ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ.605 కోట్లను మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. నీటిపారుదల వనరులు, వ్యవసాయాభివృద్ధిపై ప్రభుత్వ నిర్లక్ష్యం కనబడుతోంది. తాండవ, పెద్దేరు, రైవాడ, కోనాం జలాశయాల ఆధునికీకరణ, అభివద్ధి పనులు, ఆయకట్టు స్థిరీకరణకు కేటాయింపులు సరిపోవు. పారిశ్రామికాభివద్ధి, ఉపాధిపై భరోసా ఇవ్వలేదు. మూడు సహకార సుగర్ ఫ్యాక్టరీల పునరద్ధరణపై హామీ ఇవ్వలేదు. యువతకు నిరుద్యోగ భతిపై ప్రస్తావించలేదు. ప్రజలు పెట్టుకున్న ఆశలపై నీళ్లుజల్లేలా బడ్జెట్ వుంది.

జి.కోటేశ్వరరావు,
సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి

ఎంసి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సంధ్యాదేవి
▶ వార్త 2లో..

విద్యా విధానంలో మార్పులు అవసరం
▶ వార్త 2లో..

రైతులకు చెరుకు బకాయిలు చెల్లించాలి
▶ వార్త 5లో..

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

హాజరుకానున్న 42,257 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15 వరకు జరిగే ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ చేసినట్టు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.మురళీధర్ తెలిపారు. విశాఖపట్నం జిల్లా వ్యాప్తంగా 211 కళాశాలల నుంచి మొదటి సంవత్సరం పరీక్షలకు మొత్తం 42,257 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో బాలురు 22,464, బాలికలు 19,793 మంది ఉన్నారు. అదేవిధంగా రెండో సంవత్సరం పరీక్షలకు మొత్తం 40,744 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 21,464, బాలికలు 19,280 మంది ఉన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు మొత్తం ఏడు జోన్‌లలో 87 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు.

పలు ప్రధాన రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విజయవాడ డివిజన్‌లో కడియం - ద్వారపూడి - అనపర్తి మధ్య ఆటోమేటిక్ సెక్షన్‌ను ప్రారంభించడం కోసం నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. ఆ వివరాలను శుక్రవారం రైల్వే అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆ మేరకు 17239 గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్ మార్చి1, 2 తేదీలలో, 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ మార్చి 2, 3 తేదీలలో, 22701 విశాఖపట్నం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 గుంటూరు - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ మార్చి 2న, 12805 విశాఖపట్నం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ మార్చి 2న, 12806 లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ మార్చి 3న రద్దయ్యాయి.

పారిశ్రామిక ప్రాంతాల్లో..

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ.. ఔత్సాహికులకు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జరిగిన జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) సమావేశంలో ఆయన పలు అంశాలపై చర్చించారు. అన్ని రకాల సాంకేతిక అంశాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. సమావేశంలో భాగంగా గతంలోని అజెండా అంశాలపై తీసుకున్న చర్యల గురించి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు అనువైన మౌలిక సదుపాయాలను మెరుగు పరచడంతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో అధికారులు పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గాజువాక ఆటోనగర్ వద్దగల రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఒబి), పెదగంట్యాడ, అగనంపూడి, ఆటోనగర్‌లలో ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, పిఎం విశ్వకర్మ యోజన పథకం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన ఆయన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్మాణాలకు, పరిశ్రమల నిర్వహణకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉమ్మడి విశాఖకు నిరాశే..

వరకూ బాగున్నా నిబంధనల పేరిట కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్న ఆందోళన పలువురిలో ఉంది. ప్రస్తుతం ఈ భరోసా పథకం ద్వారా 14 వేల మంది మత్స్యకారులు లబ్ధిపొందుతున్నారు. రాష్ట్రంలోని పోలీస్ కమిషనరేట్ల పరిధిలో స్టేషన్లకు రూ.300 కోట్లును రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించారు. అయితే, వీటిలో జీతభత్యాలకే రూ.290 కోట్లు అలవెన్సులు ఇవ్వాల్సి ఉండడంతో ఇది పెద్దగా పెరుగుదల కాదంటూ పోలీస్ శాఖకు చెందిన సిబ్బంది వాపోతున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ల్యాండ్ ట్యాక్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏటా వసూలు చేస్తోంది. దీన్ని మినహాయించాలన్న డిమాండ్ కార్మిక సంఘాలు చేస్తున్నా అమలు కావడం లేదు. ప్రైవేట్ అదానీ గంగవరం పోర్టుకు నాలా, ల్యాండ్ ట్యాక్స్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని, విశాఖ స్టీల్‌కు అలాంటి మినహాయింపు ఇస్తే ఆర్థిక భారం తగ్గుతుందన్న డిమాండ్ కార్మికుల వైపు నుంచి ఉంది. దీన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు.

సాగునీటి అవసరాలు తీర్చని ప్రభుత్వం

కూటమి ప్రభుత్వ బడ్జెట్ అనకాపల్లి జిల్లా ప్రజల ఆశలను తీర్చేలా లేదు. ప్రధానంగా సాగునీటి వనరులకు కేటాయింపులు ప్రాజెక్టులు పూర్తయ్యేలాలేవు. 17 వేల కోట్ల విలువైన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.605.75 కోట్లునే కేటాయించారు. గతేడాది కంటే కేటాయింపులు పెంచినప్పటికీ ప్రాజెక్టు అవసరాలకు తగినట్లు కేటాయించలేదు. జిల్లాలో పెద్దగాలేని సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలన్న సంకల్పం ప్రభుత్వంలో కనిపించడంలేదు. వ్యవసాయ రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టిచ్చినట్లు బడ్జెట్ కేటాయింపులున్నాయి. సుజల స్రవంతికి 2023-24 వైసిపి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయించి నిధులు విడుదల చేయలేదు. 2024-25 బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం చేసిన రూ.63.21 కోట్ల కేటాయింపు కాగితాలకు పరిమితమైంది. 2025-26 బడ్జెట్‌లో చేసిన రూ.605.75 కోట్లులో భూ సేకరణకైనా నిధులు విడుదల చేస్తారా ? కేటాయింపులకే పరిమితమవుతారా ? అనేది వేచిచూడాలి. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నియోజకవర్గ పరిధిలోని తాండవ జలాశయానికి గతేడాది కంటే బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయి. తాండవ గేట్, ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటర్ల మరమ్మతులకు గత బడ్జెట్‌లో రూ.7.50 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.48.30 లక్షలు కేటాయించింది. పెద్దేరు జలాశయానికి గతేడాది పది వేలు కేటాయించగా, ఈసారి రెండు కోట్లు కేటాయించింది.

రైవాడ, కోనాం జలాశయాలకు కేటాయింపులు పెరిగాయి. రైవాడకు రూ.75 లక్షలు, కోనాంకు రూ.10.01 లక్షలు కేటాయించింది. ఈ జలాశయాల ఆధునికీకరణతో పాటు ప్రధాన కాలువల మరమ్మతులు చేపట్టాల్సివుంది. గతసారి కంటే కేటాయింపులు పెరిగినా జలాశయాల ఆయకట్టు స్థిరీకరణకు, మరమ్మతు పనులు పూర్తిగా చేయడానికి కేటాయించిన నిధులు సంపూర్ణంగా విడుదల చేసినా సరిపోవు.

ఆదివాసీలకు అన్యాయం

కూటమి ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఆదివాసీల సంక్షేమానికి రూ.8159 కోట్లు కేటాయించినట్టు గొప్పలు పోతున్నా అవి గిరిజన ప్రాంతానికీ ఏమూలకూ సరిపోవు. ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల, జిఒ నెంబర్ 3కి చట్టబద్ధత వంటి అంశాలపై బడ్జెట్ ప్రసంగంలో కనీస ప్రస్తావన లేకపోవడం అందరినీ బాధించింది. ఆదివాసీలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు 6.59 శాతం జరగాల్సి ఉండగా ఆ తీరుగా కేటాయింపులు లేవు. దీంతో ఆదివాసీలంతా ఆగ్రహంతో ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

అవసరమైన నీటి వనరులను సమకూర్చాలని, సొసైటీ భవనాల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. భూ సేకరణ, సింగిల్ విండో క్లియరెన్స్ అంశాల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఇ సెక్టార్ల ఏర్పాటులో చురుగ్గా వ్యవహరించాలన్నారు. కోర్టు కేసులు, ఆక్రమణల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో భాగంగా ఐలా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు ఆటోనగర్, ఐటి హిల్స్ వద్ద కావల్సిన సదుపాయాలపై కలెక్టరుకు నివేదించారు. ఆటోనగర్‌లో వాహనాల పార్కింగ్‌కు చాలా ఇబ్బంది అవుతోందని, బయట నుంచి ప్రయివేటు వాహనాలు వస్తున్నాయని, వాటిని తనిఖీ చేసేందుకు పోలీసు విభాగం సాయంతో చెక్ పోస్టులు పెట్టాలని, అదనపు పార్కింగ్ స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ చర్యలు చేపట్టాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

విద్యా విధానంలో మార్పులు అవసరం



మాట్లాడుతున్న జిఎస్ఎన్.రాజు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉన్నత విద్యావిధానంలో మార్పులు అవసరమని, ముఖ్యంగా సాంకేతిక విద్యలో ప్రాక్టికల్ నైపుణ్యం పెంచాలని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అచార్య జిఎస్ఎన్.రాజు అన్నారు. ఆచార్య తుమ్మల వేణుగోపాలరావు 97వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం బహుముఖ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భారతదేశ ఉన్నత విద్య - భవిష్యత్తు అనే అంశంపై సదస్సు, ఫొటో ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. సదస్సుకు యుపిఎస్‌సి పూర్వ సభ్యులు కెఎస్.చలం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిఎస్ఎన్.రాజు మాట్లాడుతూ రానున్నకాలంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ముఖ్య భూమిక పోషించనుందని తెలిపారు. సైన్స్ విజ్ఞానాన్ని, ఇంజినీరింగ్ ఉపాధిని ఇస్తుందని అన్నారు. వేణుగోపాలరావు ఉన్నత ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. నేడు ఉన్నత విద్యను వ్యాపారంగా మార్చారని ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఉన్నత విద్యకు, ఆంధ్ర విశ్వ విద్యాలయానికి నిధులు సరిగా కేటాయించకపోవటం బాధాకరమని అన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ దేశంలో అందరికీ విద్య, ఉద్యోగం అందుబాటులోకి రావాలని వేణుగోపాలరావు ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుత సమాజం మనుగడకు సోషలిజం ఒక్కటే మార్గమని అన్నారు. ప్రాథమిక విద్యా రంగం మనుగడకు నేడు ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం మాజీ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు, డాక్టర్ వి.కృష్ణమూర్తి, డాక్టర్ నళిని, స్వతంత్ర కుమార్ పాల్గొన్నారు. డాక్టర్ ఎడివి.లక్ష్మి చిత్రీకరించిన ఫొటోను, డాక్టర్ నళిని రచించిన వేణు మాస్టారి స్మృతులు (విజ్ఞాన సమితి - విద్యా దీప్తి) పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.

ఎంసి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సంధ్యాదేవి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కెవిఎస్.సంధ్యాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు మెడికల్ ఎడ్యుకేషన్ ఆఫ్ డైరెక్టర్ నుంచి శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు వచ్చాయి. తక్షణం ఈ నియామకం అమల్లోకి వస్తుందని, డాక్టర్ సంధ్యాదేవి పూర్తి అదనపు బాధ్యతలతో ప్రిన్సిపాల్‌గా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డాక్టర్ సంధ్యాదేవి ఈ కళాశాలకు చెందిన సీనియర్ ప్రొఫెసర్లలో ఒకరు. ఇంతవరకు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ బి.బుచ్చిరాజు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు.

ఘనంగా దర్జీల దినోత్సవం



భీమిలిలో టైలర్స్‌డే కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే గంటా

టైలర్ల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : టైలర్ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు అన్నారు. చిట్టి వలస జ్యూట్ మిల్లు కల్యాణ మండపంలో స్థానిక ఎల్లమాంబ టైలర్ల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ టైలర్ల దినోత్సవం నిర్వహించారు. తొలుత కుట్టు మిషన్ సృష్టి కర్త విలియం ఎలియస్ హోవే చిత్రపటానికి, ఎమ్మెల్యే గంటాతో పాటు మాజీ కౌన్సిలర్ కొప్పల రమేష్, టిడిపి ఒకటో వార్డు అధ్యక్షులు తమ్మిన సూరిబాబు ,సంఘం ప్రతినిధులు, టైలర్లు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ, టైలర్ల సంఘ సభ్యుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ స్థలంతో పాటు సామాజిక భవనం మంజూరుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. దర్జీల దుకాణాలకు దుకాణాల ఎదుట నేమ్ బోర్డులకు జివిఎంసి, వార్డు సచివాలయం సిబ్బంది పన్నుల వసూళ్లను నిలిపేసేలా చర్యలు తీసుకోవాలని టైలర్లు కోరగా, ఎమ్మెల్యే గంటా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పెంటపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి చింతల సురేష్, గౌరవ సలహా అధ్యక్షులు జోగ వెంకటరావు పాల్గొన్నారు. ముందుగా చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ నుంచి జ్యూట్ కార్మికవాడ మీదుగా స్థానిక జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

సీతమ్మధార : టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కోరారు. శుక్రవారం శంకరమఠం దరి పద్మశాలి కళ్యాణ మండపంలో గ్రేటర్ విశాఖ టైలర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ టైలర్ దినోత్సవంలో పాల్గొన్నారు. టైలరింగ్ గురువులను సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ సిహెచ్ యాదగిరిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణ, సెక్రెటరీ సిహెచ్.వేణు, జాయింట్ సెక్రెటరీ ఎస్‌కె ఇశాఖ్, క్యాషియర్ సిహెచ్. తిరుమలరావు, జాయింట్ క్యాషియర్ ఆర్‌కె. రాజు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ మండల కేంద్రంలో నవయుగ టైలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్ డే కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ టైలర్ పరవాడ లోవరాజు, వానపల్లి సూరిబాబు కుట్టు మిషన్ కనిపెట్టిన థామస్ సెయింట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ టైలర్ వానపల్లి సూరిబాబును సంఘం సభ్యులు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పరవాడ గ్రామం టైలర్స్ పాల్గొన్నారు.

యలమంచిలి : రెడీమేడ్ దుస్తులు మార్కెట్లో విచ్చలవిడిగా లభిస్తుండడంతో టైలర్స్ బతుకులు అయోమయంలో పడ్డాయని మండల టైలర్స్ యూనియన్ అధ్యక్షులు సత్తిబాబు పేర్కొన్నారు. టైలర్ డే సందర్భంగా శుక్రవారం యలమంచిలిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మళ్ల శ్రీను, పిల్లా శివ, కె.వీరభద్రరావు, దుప్పట్ల శేషు, రైవాడ శంకర్రావు పాల్గొన్నారు.



యలమంచిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్లు

మునగపాక : చేతివృత్తి ఆధారంగా జీవిస్తున్న దర్జీలకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహాన్ని అందించి పూర్వ వైభవం వచ్చేలా ఆదుకోవాలని వీరభద్ర టైలర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ప్రపంచ టైలర్స్ డే సందర్భంగా మండలంలోని గవర్ల అనకాపల్లిలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు టి సిరసపల్లి సర్పంచ్ మద్దాల నాగ అప్పారావు, ఆళ్ల వెంకటరావు, పెంటకోట శివాజీ, అప్పికొండ శివ, కాండ్రేగుల వెంకటలక్ష్మి, పొలమరశెట్టి శారద, అంగులూరి శ్రీనివాస్, ద్రాక్షారపు రామకృష్ణ, వానపల్లి వెంకట అప్పారావు, పెంటకోట రామ జోగినాయుడు, అప్పికొండ రామచంద్రరావు, దాడి శ్రీనివాస్, మల్లేష్ పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

18 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -గాజువాక : పాత గాజువాకలో ఒక వ్యక్తి దగ్గర అక్రమంగా నిల్వ ఉన్న 18కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. పక్కాగా అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, కేరళ రాష్ట్రానికి చెందిన షమీమ్ అనే యువకుని వద్ద గంజాయి పట్టుబడింది. గంజాయితోపాటు నిందితుని సెల్‌ఫోనుస్వాధీనం చేసుకున్న పోలీసులు, అతడిని అదుపులోకి తీసుకున్నారు.

బాలికపై అత్యాచారయత్నం

ప్రజాశక్తి-గాజువాక : బాలికపై అత్యాచారయత్నం చేసిన కేసులో సన్నిబాబు అనే వ్యక్తిపై గాజువాక పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.ఘటనపై బాలిక తల్లిదండ్రులు గాజువాక స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడు సన్నిబాబును అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గాజువాక పోలీసులు తెలిపారు

బార్లలో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో పలు బార్ అండ్ రెస్టారెంట్లలో శుక్రవారం రాత్రి గాజువాక ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బార్లలో మద్యం నిల్వలు, వాటి ధరలపై ఆరా తీశారు. అక్కడున్న వినియోగదారులను ప్రశ్నించారు. తనిఖీల్లో గాజువాక ఎక్సైజ్ సిఐ చావా శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి-ఆనందపురం : కుంభమేళాకు వెళుతూ, మండలంలోని గిడిగుండం జాతీయ రహదారిపై ఈనెల 23నన ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న కర్ణాటక రాష్ట్రం బళ్లారి ప్రాంతానికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళ మృతి చెందిందని పోలీసులు తెలిపారు. కేసును ఆనందపురం సిఐ చింత వాసునాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో నిందితునికి నాలుగేళ్ల జైలుశిక్ష, జరిమానా

ప్రజాశక్తి- విశాఖ లీగల్ రిపోర్టర్ : గంజాయి రవాణా కేసులో నిందితునిపై నేరాభియోగం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు, రూ.20వేలు జరిమానా విధిస్తూ మత్తుమందుల కేసులు విచారణ ప్రత్యేక న్యాయస్థానం, ఒకటవ అదనపు జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి ఎం వెంకటరమణ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన గ్రేడ్ వన్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జివిఎస్‌వి ప్రసాదరావు. కోర్టు లైజెనింగ్ కానిస్టేబుల్ సిహెచ్ వీరేంద్ర అందించిన వివరాలివి. నమ్మకమైన సమాచారంతో విశాఖపట్నం లోని కొబ్బరి తోట ప్రాంతంలో అప్పటి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐ వై గోవిందరావు, పోలీసులతో నిర్వహించిన నాకాబందీలో అదే ప్రాంతానికి చెందిన బోలెం, వెంకన్న బాబు, ఒక్కొక్కటి 13 కేజీలు చొప్పున రెండు సంచుల్లో గంజాయి తో పట్టుబడ్డారు. దీనిపై దర్యాప్తు చేసిన సిఐ టి.కల్యాణి అరెస్టు చేసి కోర్టు ప్రవేశపెట్టారు. దర్యాప్తు అనంతరం నేరాభియోగపత్రం కోర్టులో దాఖలు చేశారు. విచారించి న్యాయ మూర్తి నిందితుడిపై నేరం రుజువైనందున శిక్షవిధిస్తూ తీర్పు వెల్లడించారు.

అనాథాశ్రమానికి సామగ్రి వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : పాత డెయిరీఫారం, ఇందిరాగాంధీనగర్‌లోని ఆనంద మార్గ చిల్డ్రన్ హోమ్‌కు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఎన్ఆర్ఐ కడియం శ్రీను, ఆయన సతీమణి సత్యమాధవి శుక్రవారం అనాథా శ్రమం నిర్వహణకు అవసరమైన సామగ్రిని సమకూర్చారు. ఎలక్ట్రికల్ కుక్కర్లు, ఇడ్లీ పాత్రలు, కార్పెట్లు, స్టీల్ పాత్రలు, చాపలు, వాటర్ బాటిళ్లు, ఇతర సామగ్రిని తమ పిల్లలు రోమి,రేలా పేరున వైజాగ్‌కు చెందిన బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి పి.బాబూరావు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు హోం నిర్వాహకులు ఆచార్య సౌమ్యానంద అవధూత ధన్యవాదాలు తెలిపారు.



సామగ్రిని అందజేస్తున్న దాతలు

మహారాజశ్రీ నర్సీపట్నం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 179 / 2021

వాది: దోకల సత్యవతి, భర్త కన్నంనాయుడు
ప్రతివాదులు: 1.అనిమిరెడ్డి నారాయణమ్మ 2. అనిమిరెడ్డి యశ్వంత్

CPC ఆర్డరు 5 రూలు 20 ప్రకారము 2వ ప్రతివాది / రెస్పాండెంట్‌కు దావా సమన్లు ప్రకటన

2వ ప్రతివాది / రెస్పాండెంట్: అనిమిరెడ్డి యశ్వంత్, తండ్రి లేటు అనిమిరెడ్డి ఎర్రన్న, శా॥ కొండల అగ్రహారం గ్రామం, మాకవరపాలెం మండలం, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది/ రెస్పాండెంట్ అయిన మీకు పలు పర్యాయములు కోర్టు నుండి మరియు రిజిష్టరు పోస్టు ద్వారానూ దావా సమన్లు పంపినప్పటికీ మీరు అందుకొని యుండలేదు. అందుపై శ్రీకోర్టు వారు మీకు దావా సమన్లు పత్రికా ప్రకటన ద్వారా పంపవలసిందిగా ఉత్తరువులు జారీ చేయించియున్నారు.

కాగా ఇందుమూలముగా మీకు తెలియ జేయునది ఏమనగా పై నెంబరు దావాను శ్రీ కోర్టు వారు **తే: 06-03-2025కి** వాయిదా వేయించి ఉన్నారు. **తే:06-03-2025దిన** మీరు స్వయంగా కాని న్యాయవాది ద్వారా గాని హాజరయి మీకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల శ్రీ కోర్టు వారికి తెలియజేసుకోనవలెను. లేనియెడల మీకు ఎట్టి ఆక్షేపణలు లేవని ఎంచి మీ పరోక్షములో శ్రీకోర్టు వారు తమ ముందున్న దస్తావేజుల ఆధారముగా తీర్పు చెప్పెదరు.

వాయిదా తేదీ: 06-03-2025

మెట్ట ప్రభాకర్
న్యాయవాది, నర్సీపట్నం
నర్సీపట్నం సెల్: 8179154586
తే:28-2-25 7989015974

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఏ.నెంబర్: 833/2023
ఇన్
ఓ.ఎస్.నెంబర్: 23/2020

రెక్కల లక్ష్మిరెడ్డి ...పిటీషనర్/వాది
వర్సెస్
గుగ్గుల వెంకట నరసయ్య మరియు వగైరాలు ... రెస్పాండెంట్/ ప్రతివాదులు

R8) ఐలా రామగోపాల్, తండ్రి వెంకట నరసయ్య,
R10) ఐలా పవన్ జయకృష్ణ తండ్రి రామ గోపాల్, ఇద్దరూ ఆగనమ్ పూడి, గాజువాక, పెదమాక, విశాఖపట్నం జిల్లా.

నోటీస్ అండర్ ఆర్డర్ 1 రూల్ 10 ఆఫ్ సి.పి.సి.

పై నెంబర్ పిటిషనర్ కోరి పై నెంబర్ పిటిషన్ ను మీపై దాఖలు చేయగా సదరు పిటిషన్ లో R8 మరియు R10 అయిన మీరు పలుమారులు నోటీసు తీసుకొనని కారణాన మీకు తే:24-03-2025దీ నకు వాయిదా కలదు. సదరు తేదీన ఉదయం గం.10:30 నిమిషములకు శ్రీవారి కోర్టులో హాజరై తమరి ఆక్షేపణలు తెలియచేయవలెను. లేనియెడల మీ పరోక్ష మున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ : 24-03-2025

ఇట్లు
తాటికొండ రామ మోహన్‌రావు, బి.ఏ.,బిఎల్, అడ్వకేట్,
పొదిలి, ప్రకాశం జిల్లా.
సెల్ : 9885636729.

IN THE HON'BLE COURT OF THE XIII ADDL. DISTRICT JUDGE AT GAJUWAKA
O.S.35/2023

Between:
Sri Komma Krishna Rao,
Plaintiff is being Rep. by his GPA Holder
Sri Parachuri Ramakoteswara Rao
...Plaintiff

And:
Sri Komma Krishna Rao & 4 others
...Defendants

SUMMONS

To,
D-1: **Sri Komma Krishna Rao,**
S/o. Veera Ragavayya,
R/at D.No. 38-1-30,
Srinivasa Nagar, Marripalem,
Visakhapatnam.
D-2: **Sri Yedupati Venkateswarulu,**
S/o. China Kodayya,
R/at D.No.10-8-26/9, Azeemabad,
Kanithi Road, Gajuwaka,
Visakhapatnam.
D-3: **Sri Satti Dora Reddy,**
S/o. Venkata Reddy, R/at D.No. 6-10-5/5,
L.B.Nagar,Drivers Colony,
Old Gajuwaka, Visakhapatnam.
D-4: **Smt. Vallabhaneni Devi Kiranmayee**
W/o. Durga Prasad,
R/at D.No. 31-25-48/10, Flat No:202,
Sri Lalitha Aracde, Sri Krishna Nagar,
Road No.3, Kurmannapalem, Duvvada,
Visakhapatnam.
D-5: **Sri Waseem Akaram Raja,**
S/o. Zameer Ahmed, R/at Flat No:E-204,
Shivaji Nagar, Near Toll Gate,
Kurmannapalem, Visakhapatnam.

Please take notice that the above suit O.S.35/2023 stands posted to **17-03-2025** for your appearance. As ordered by the Hon'ble Court, you are hereby directed to appear before the above Hon'ble Court on **17-03-2025** at **10-30 A.M.** either personally or through an Advocate and file your objections, if any, or else, the matter will be decided in your absence.

V. SANTOSH KUMAR, Advocate
25-31-3, Vadaveedhi,
Visakhapatnam.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అనకాపల్లి జిల్లా, మునగపాక గ్రామ కాపురస్తులు వెలగా సూర్యనారాయణ గారి కుమారుడు వెంకటేశ్వరరావు గారు నాకు ఇచ్చిన బోగట్టానుబట్టి యావన్మందికి తెలియజేయునది :

నా క్లయింటు అనకాపల్లి జిల్లా అనకపల్లి గ్రామం (ఆవఖండం) గవరపాలెంలో S.Nos. 1087/20, 1087/14, 1087/15 ప్లాట్ నెంబర్ 5 గలిగిన 259.25 sq. విస్టీర్ణం గల ఆస్తిని 25.6.2007 ది.క్రియ చీటి మూలంగా స్వాధీనం పొంది సంపూర్ణ హక్కుభుక్తములు కలిగియున్నారు. అట్లుండగా సదరు నా క్లయింటు సదరు ఆస్తిని విక్ర యించ దలచి శ్రీ వెలగా రవికిశోర్ గారి బార్య మాధురి గారితో క్రియ ఒప్పందం చేసుకొని ఉన్నారు.

అయితే నా క్లయంటు తాలూకు సదరు ఆస్తికి సంబంచిన తే 8.2.2006 ది. నెంబర్ 512/2006 లింక్ సేల్ డీడు ఒరిజినల్ తన ఇతర పనులకు సంబంధించి జరిగించే పనులకు చేసిన ప్రయాణంలో ఎక్కడో పడిపోయి తన ప్రయత్నములలో తిరిగి లభ్యం కాలేదు. అటు పిమ్మట నా క్లయింటు తప్పనిసరి పరిస్టితులలో అనకాపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కంప్లైంట్ యీయగా సదరు పోలీస్ వారు **"BEYOND TRACE ON THEIR EFFORTS"** అని సర్టిఫికేట్ ఇచ్చినారు. అటు పిమ్మట నా క్లయంటు సదరు మిస్ కాబడిన లింక్ సేల్ డీడ్ ప్రత్యామ్నాయములతో సదరు క్రియచీటీ పనులకు క్రియ అగ్రిమెంట్ షరతులకులోబడి ఉపక్రమించినారు. కావున షెడ్యూల్ ఆస్తికి సంభందించి నా క్లయింటుకు గల సంపూర్ణ హక్కు అనుభవముల గురించి ఎవరికయినా ఎటువంటి ఆక్షేపణలుగాని, ఇంకనూ సదరు ఆస్తి యందు ఏమైనా క్లైములుగాని వున్నయెడల ఈ నోటీసు తేదీ లగాయతు 7 దినములలోగా ఈ దిగువ అడ్రసుకు సంప్రదించగలరు. అట్లుకానిచో నిరాక్షేపణగా భావించి నా క్లయింట్ సదరు శ్రీమతి వెలగా మాధురి గారి క్రియ అగ్రిమెంటు షరతుల ప్రకారం సరియగు క్రియచీటి execute చేయగలరని ఇందుమూలంగా తెలియ జేయడమైనది.

ఎం.పైడిరాజు,
అడ్వకేట్, తుమ్మపాల గ్రామం,
అనకాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా
అనకాపల్లి,
తేది:28-2-2025.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -మధురవాడ : గాయత్రి విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కాలేజీ, ఎలక్ట్రికల్ విభాగంలో ఐదురోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం శుక్రవారంతో ముగిసింది. ఐఎస్‌టిఇ సహకారంతో మైక్రోగ్రిడ్, ఎలక్ట్రికల్ వెహికల్స్‌పై అవగాహన కల్పించారు. జెఎన్‌టియు పూర్వ ఉప కులపతి ఆచార్య రంగా జనార్దన, పలువురు నిపుణులు పాల్గొని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. శిక్షణను డాక్టర్ శ్రీకాంత్ కవిరాయని సమన్వయం చేశారు.

ఉండలేక .. ఊరొదిలి వెళ్లలేక చస్తున్నాం!

- అదానీ గంగవరం పోర్టు కాలుష్యంపై రామచంద్రనగర్ మహిళల ఆవేదన
- డంపింగ్ యార్డు తరలించాలని వేడుకోలు

ప్రజాశక్తి -గాజువాక : సొంత ఇళ్లు ఉన్నాయని గ్రామంలో ఉండలేక, ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అదానీ గంగవరం పోర్టు కాలుష్యాన్ని భరించలేక అనునిత్యం చచ్చిబతుకుతున్నామని జివిఎంసి 76వ వార్డు రామచంద్రనగర్ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రామచంద్రనగర్‌లో ఒక టీవీ ఛానల్ నిర్వహించిన చర్చాగోష్ఠిలో మాట్లాడుతూ, ఆదానీ గంగవరం పోర్ట్ నుండి తమకు రక్షించాలని వేడుకుంటున్నారు. గంగవరం పోర్టు కాలుష్యం వల్ల చిన్నపిల్లలకు ఊపిరితిత్తులు, గుండె, చర్మ సంబంధిత వ్యాధులతోపాటు కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు బారిన పడుతున్నామని మహిళలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఎన్నికలు, ఇతరత్రా సమయాల్లో రాజకీయనేతలు, ప్రజాప్రతినిధులు హామీలిచ్చి వెళ తున్నారే తప్ప అమలు చేయడం లేదని వాపోతున్నారు.

ఆదానీ గంగవరం పోర్టు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో మరోపక్కన రామచంద్రనగర్ డంపింగ్ యార్డ్ గుదిబండలా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్‌యార్డు దుర్వాసనతో పీల్చే గాలి, తినే తిండి సర్వం కాలుష్యకారకంగా మారిపోయాయని అంటున్నారు. వీటిపై అనేకమార్లు మొరపెట్టుకున్నప్పటికీ, స్పందించే దిక్కులేకపోవడంతో సొంతిళ్లున్నా ఖాళీచేసి వేరే ఊళ్లకు అనేకమంది వెళ్లిపోతున్నారని,గత్యంతరం లేనివారే గ్రామంలో ఉండలేక, చావలేక బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రామచంద్రనగర్ గ్రామ ప్రధానకార్యదర్శి డి రమణ మాట్లాడుతూ మూడేళ్లగా ఆదానీ గంగవరం పోర్టు కాలుష్యంతో ధర్నాలు, ఆందోళన చేస్తున్నా అటు పోర్టు యాజమాన్యంగానీ, ఇటు ప్రభుత్వం గానీ ఇసుమంతైనా స్పందించడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా నేతలు, అధికారులు స్పందించాలని గంగవరం పోర్టు, డంపింగ్‌యార్డు కాలుష్యం నుంచి తమను విముక్తిల్ని చేయాలని వేడుకుంటున్నారు. కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న గ్రామాలను ప్రభుత్వం, గంగవరం పోర్టు యాజమాన్యం దత్తత తీసుకుని ఆదుకునే చర్యలు చేపట్టాలని, ఇప్పటికే రోగాలబారిన పడి వారికి వైద్యసేవల కోసం సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో.. రూప, రమణి, తార, పోలమ్మ పెద్దసంఖ్యలో కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు..


పోర్టు కాలుష్యంపై ఆవేదన వ్యక్తం చేస్తున్న రామచంద్రనగర్ మహిళలు

పద్మపూజిత వీల్స్‌మార్ట్‌లో నేటి నుంచి మెగా సేల్ మేళా


బసవరాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : పద్మపూజిత వీల్స్ మార్ట్ సంస్థ ఆధ్వర్యంలో దొండపర్తిలోని సంస్థ కార్యాలయం వద్ద ఈనెల ఒకటి నుంచి మెగా సేల్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ అధినేత బసవరాజు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పద్మపూజిత వీల్స్ మార్ట్ సంస్థఆధ్వర్యంలో ఏటా మెగా సేల్ మేళా నిర్వహిస్తున్నామని, అలాగే ఈ ఏడాది కూడా సేల్ మేళాలో 400కు పైగా టూవీలర్స్, 50 పైగా కార్లు ప్రదర్శనలో ఉంచుతున్నట్లు తెలిపారు. అన్ని రకాల బ్రాండెడ్, విభిన్న మోడళ్లలో టూవీలర్స్ వెహికల్స్, కార్లు వినియోగదారులకు ప్రదర్శనలో ఉంచుతామని, ఈ అవకాశాన్ని విశాఖ ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. సేల్‌మేళాను జయప్రదం చేయాలన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం


సాయం అందిస్తున్న కంచర్ల ట్రస్ట్ సభ్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ: నిరుపేద అంత్య క్రియలకు ఉపకార్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్, సంఘ సేవకులు డాక్టర్ కంచర్ల అచ్యుతరావు ఆర్థిక సాయం అందజేసారు. ఆరిలోవ నెహ్రూ నగర్కు చెందిన పేద మహిళ కంటిపూడి సత్యవతి కేన్సర్‌తో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కంచర్ల అచ్యుతరావు, తన ఉపకార్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అంతిమ సంస్కారాలకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి నాగు మాట్లాడుతూ కష్టాలు, ఇబ్బందుల్లో ఉన్నవారికి ఉపకార్ ట్రస్ట్ అధినేత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు సాయం అందజేశారన్నారు. దాతలకు బాధిత కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు.

ఎఐటియుసి నేత బాబూరావు మృతి


అల్లు బాబూరావు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - తగరపువలస : జివిఎంసి ఒకటోవార్డు చిట్టివలస, కొత్తపేటకు చెందిన చిట్టివలస లేబర్ యూనియన్ (ఎఐటియుసి), సిపిఐ నేత అల్లు బాబూ రావు (78) శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో మతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బాబూరావు, ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, ఆరోగ్యం విషమించి మృత్యువాత పడ్డారు. పార్టీలోనూ, ట్రేడ్ యూనియన్‌లోనూ వివిధ హోదాల్లో చురుగ్గా పనిచేసిన బాబూరావు, ప్రస్తుతం చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులుగా, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యంతో పాటు పాలకులు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా అనేక పోరాటాలు, ఉద్యమాలకు నేతృత్వం వహించి నిర్బంధాలను ఎదుర్కొన్నారు. బాబూరావుకు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పలువురి సంతాపం

బాబూరావు మృతికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్య నారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, చిట్టివలస లేబర్ యూనియన్ అధ్యక్షులు పడాల రమణ, స్థానిక పార్టీ, యూనియన్ నాయకులు కానూరు రాంబాబు, ఎం అప్పలరాజు, సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్‌మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు, కాకాస నాయకులు దల్లి అప్పలరెడ్డి, ఎం.ఆదినారాయణ, టిఎన్‌టియుసి నాయకులు ఎంవి గురుమూర్తి తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తంచేసి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

విశాఖ పోర్టు సొంత నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలి : సిఐటియు


దీక్షల్లో నినాదాలు చేస్తున్న సిఐటియు నేతలు, ఉద్యోగులు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని పోర్టు సొంత నిధులతో అభివృద్ధి చేయాలని పోర్టు ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో అక్కయ్యపాలెంలోని విశాఖ పోర్టు ఆసుపత్రిని ప్రయివేటుపరం చేయాలన్న చర్యలకు వ్యతిరేకంగా చేపడుతున్న 151వ రోజు నిరసన దీక్షలను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ ఆలోచన మానుకోవాలని కోరారు. ఉద్యోగులు, కార్మికుల కష్టాల ఫలితంగా వచ్చిన లాభాలతో, వారి ఆరోగ్యసంక్షేమం కోసం ఏర్పాటైన ఆసుపత్రి 50ఏళ్ల విజయవంతంగా నడిచిందని, ఇపుడు దాన్ని ప్రయివేటుకు ధారాదత్తం చేయాలని చూడడం దుర్మార్గమన్నారు. విశాఖ పోర్టుతోపాటు ఆసుపత్రి నిర్వహణకు వందేళ్లకు సరిపడా రిజర్వ్‌ఫండ్స్, ఆస్తులు పోర్టుకు ఉన్నాయని, అయినా అభివృద్ధి పేరుతో పిపిపి అంటూ ప్రయివేటుకు కట్టబెట్టాలనే బిజెపి ప్రభుత్వ చర్యలు సమంజసం కాదన్నారు. పోరాడి డిసిఐని పరిరక్షించుకున్న స్ఫూర్తితోనే పోర్టు ఆసుపత్రిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్ త్రినాధరావు, ఆనందరావు, అప్పారావు, రామలింగేశ్వరరావు, బి జగన్, రాఘవులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధో హక్కులపై సునిశిత సమీక్ష అవసరం

గీతం అంతర్జాతీయ సదస్సులో న్యాయ నిపుణులు


అతిథులను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : కృత్రిమమేధ (ఎఐ)వినియోగం అన్ని రంగాలలో పెరుగుతున్న నేపథ్యంలో మేధోహక్కుల విషయంలో సునిశిత సమీక్ష అవసరమని, నైతికపరమైన అంశాలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు న్యాయనిపుణులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం గీతం డీమ్డ్‌విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా, ఎక్విటస్ విక్టోరియా రీసెర్చ్ సెంటర్ (బీహార్) సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన అంతర్జాతీయ సదస్సును ఆసోం జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, జుడిషియల్ అకాడమీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెవిఎస్.శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన ఆవిష్కరణల మేధోహక్కులు ఎవరికి చెందుతాయనే అంశంపై సదస్సులో మాట్లాడుతూ గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ పరిశోధనలలో, సిద్ధాంత వ్యాసాలను సమర్పించడంలో కృత్రిమ మేధను ఒక మాధ్యమంగా వినియోగం పెరుగుతోందని, ఈ నేపథ్యంలో అసలైన మేధోహక్కులకు భంగం కలగకుండా ప్రత్యామ్నాయం చూడాలన్నారు. ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ శ్రీసుధ మాట్లాడుతూ వివిధ పరిశ్రమలలో, విద్యారంగంలో కృత్రిమ మేధ వాడకం వల్ల సరికొత్త వివాదాలు తలెత్తుతున్నాయన్నారు.

న్యాయవాద వృత్తిలో కత్రిమ మేధను సరైన విధంగా ఉపయోగించుకుని న్యాయ నిపుణులు లబ్ధిపొందవచ్చునని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ సి.హెచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ కృత్రిమ మేధను ఉపయోగించేవారు నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నూతన ఆవిష్కరణలు, సాంకేతిక ఉత్పత్తుల పరిశోధకులు పొందే మేధోహక్కులను చట్టపరంగా రక్షించే ఆలోచన అవసరం అన్నారు. జార్జియా దేశంలోని ఇవెన్ స్టేట్ యూనివర్సిటీ న్యాయ నిపుణుడు డాక్టర్ గార్గి అమిరన్ యురోపియన్ దేశాలలో కృతిమ మేధను కట్టడికి అనుసరిస్తున్న పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఎక్విటస్ విక్టోరియా ఫౌండేషన్ డైరక్టర్ డాక్టర్ డి.రంగస్వామి, సదస్సు కన్వీనర్లు డాక్టర్ జి.గణేష్‌కుమార్, ఎల్.ఆశిష్‌కుమార్, చిత్రసక్సెనా పాల్గొన్నారు

అశోక్‌కుమార్ మాస్టార్‌కు ఆత్మీయ సత్కారం


అశోక్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

ప్రజాశక్తి -పద్మనాభం : ఉద్యోగ విరమణ చేసిన మండలంలోని మద్ది జిల్లా పరిషత్ హైస్కూల్ సైన్స్ టీచర్ కొల్లు అశోక్ కుమార్‌ను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సత్కరించి, ఆత్మీయవీడ్కోలు పలికారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపిపి కె.రాంబాబు రిటైర్డు మాస్టారు అశోక్ కుమార్, వెంకటరమణ దంపతులకు పుష్పగుచ్ఛాలను అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించారు ఈ సందర్భంగా అశోక్ కుమార్ సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ చేసిన అశోక్‌కుమార్‌ను పాఠశాలలోని సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులుతోపాటు బంధుమిత్రులు, యుటిఎఫ్ నేతలు ఎవరికివారే వేర్వేరుగా దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎర్రయ్య, అప్పారావు పాల్గొన్నారు

జాబ్‌మేళాలో విశాఖ విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగార్హత సాధించిన విద్యార్థులతో కాలేజీ యాజమాన్యం

ప్రజాశక్తి- వేపగుంట : గీతం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన తొమ్మిది మంది ఇంజనీరింగ్ విద్యార్థులుఉద్యోగ అర్హత సాధించారు. రూ. 3.5 లక్షల వార్షిక వేతనంతో సదర్‌ల్యాండ్ కంపెనీలో పోస్టింగులు సాధించారు. వీరిని కాలేజీ చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ జివి.ప్రదీప్ వర్మ, సిడిసి డీన్ వర్మ, ఎగా కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ టీం అభినందించింది.కళాశాల ప్లేస్‌మెంట్ టీం ఎం.సుదీప్తి, ఎండికె. శరణ్య పర్యవేక్షణలో ఇంటర్వ్యూకు హాజరై, ఉద్యోగాలు సాధించడంపై వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు చెరుకు బకాయిలు చెల్లించాలి


ఎపి చెరుకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ

ప్రజాశక్తి-చోడవరం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గాలికి వదిలేసిందని, తక్షణమే రైతులకు చెరుకు బకాయిలు విడుదల చేయాలని, ఫ్యాక్టరీని సజావుగా క్రషింగ్ జరిగేందుకు సహకరించాలని ఎపి చెరుకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఫ్యాక్టరీని సందర్శించి ఆయన యాడ్‌లో ఉన్న రైతులతో మాట్లాడారు. వారం రోజులుగా చెరకు ఎండిపోతుందని ఫ్యాక్టరీ తీసుకోవడం లేదని, చెరుకు సరఫరా చేసిన 10 రోజులైనా పేమెంట్లు చెల్లించడం లేదని రైతులు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యే ఫ్యాక్టరీ పర్సన్ ఇన్‌ఛార్జి అయిన జిల్లా కలెక్టర్ తమ బాధలు పట్టించుకోలే ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఐదు లక్షల టన్నులు ఆడుతున్న ఫ్యాక్టరీని ఈ విధంగా నిర్వీర్యం చేయడం సరికాదన్నారు. ఈ విషయమై రాష్ట్ర సుగర్ కేన్ కమిషనర్‌తో మాట్లాడుతానని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తామని తెలిపారు. లేనిపక్షంలో రైతులతో పెద్ద ఎత్తున పోరాటం చేయడానికి చెరుకు రైతులు సంఘం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కోశాధికారి గండి నాయన బాబు, రైతు నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు



రైతులతో మాట్లాడుతున్న చెరుకు రైతు సంఘం నేత మర్రాపు సూర్యనారాయణ



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కొణతాల

రాష్ట్ర పండగగా నూకాలమ్మ జాతర

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి శ్రీనూకాంబిక అమ్మవారి జాతరను రాష్ట్ర పండగగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి నూకాలమ్మ జాతరను రాష్ట్ర పండుగ ప్రకటించాలని కోరారు. తక్షణమే తన వ్యక్తిగత కార్యదర్శి రవిచంద్రని పిలిచి నూకాలమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడం కోసం ఏర్పాట్లు చేయమని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సిఎం రమేష్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో డిఎంహెచ్ఒ తనిఖీలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని బుచ్చయ్యపేట, తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రవికుమార్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. పిహెచ్సిలో గల ఫార్మసీలు పరిశీలించారు. మందుల వివరాలను ఫార్మసిస్టులను అడిగి తెలుసుకున్నారు. వార్డులను పరిశీలించారు. ఓపి వివరాలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఐటెంపూడి గ్రామంలో జరుగుతున్న ఎన్సీడీ సర్వేపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు సేవలు అందించడంలో వైద్యుల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారుల వెంకటకృష్ణ, సునీల్ మాధవ్, లక్ష్మి నారాయణ, ఫార్మసిస్ట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాగలోకం సెట్టింగ్

ప్రజాశక్తి-అనకాపల్లి

శ్రీనూకంబిక అమ్మవారి మాల ధారాల సంఘం వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో అమ్మవారి మాల ధారణ మహోత్సవంలో భాగంగా నాగలోకంలో ఆరుగురు అక్కచెల్లెళ్ళుతో శ్రీనూకంబిక అమ్మవారు సెట్టింగులు రూపొందించారు. దుర్గమ్మ సేవకుడు, కృష్ణయ్య సాధకుడు, ఎస్డి గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్ సంతోష్ కుమారి దంపతులు ఆర్థిక సహకారంతో దీనిని ఏర్పాటు చేశారు. వచ్చేనెల 25వ తేదీన మంగళవారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన, అంగరంగ వైభవంగా అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూరిశెట్టి శ్రీను,బుద్ధరాజు, మల్లగణేష్, కొలపర్తి శ్రీను, బుద్ధచిన్ని, సూరిశెట్టి హదయ్, అక్షయ్ పవన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో పిల్లల తారుమారుపై నివేదిక ఇవ్వండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

కెజిహెచ్ ప్రసూతి విభాగంలో ఇద్దరు పిల్లల తారుమారుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఆసుపత్రి యాజమాన్యం తక్షణ నివేదికను అందించాలని కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశించారు. శుక్రవారం కెజిహెచ్‌లోని ప్రసూతి వార్డును ఆయన సందర్శించి సంబంధిత ఆడ, మగ పిల్లల ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇద్దరు తల్లులు, వారి కుటుంబ సభ్యులతో వేర్వేరుగా మాట్లాడారు. అనుమానాలు ఏమైనా వ్యక్తపరుస్తున్నారా ? మా కమిషన్‌కు ఫిర్యాదులను ఏమైనా అందిస్తారా ? అని అడిగారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ నివేదిక ఆధారంగా సంబంధిత వైద్యాధికారులు, సిబ్బంది పాత్ర ఉందని తేలితే చర్యల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సులు చేస్తామన్నారు. ప్రసూతి వార్డును సందర్శించిన వారిలో ఆసుపత్రి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ మెహర్ కుమార్, ప్రసూతి వార్డు వైద్యులు ప్రొఫెసర్ ఐ.వాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్యామల, గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్ సిహెచ్.పద్మ, బి.సురేష్ తదితరులు ఉన్నారు.



రోగులతో మాట్లాడుతున్న గొండు సీతారాం

గోవాడ సుగర్స్ ఆధునికీకరణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణపై అసెంబ్లీలో చర్చించి, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 24 వేల మంది రైతులు, వందలాది మంది కార్మికుల కష్టంతో ఫ్యాక్టరీ నడిచేదని తెలిపారు. కాని ఇప్పుడు ఏడు ఎనిమిది వేల మందికి మించి రైతులు చెరుకు సాగుచేయడం లేదని, ఈ ఏడాది రైతులకు పేమెంట్లు పూర్తి చెల్లిస్తుందన్న గ్యారెంటీ లేదని పేర్కొన్నారు. రైతులు తప్పని పరిస్థితుల్లో ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేస్తున్నారన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్య ధోరణితో క్రషింగ్ చేసే పరిస్థితి కనిపించడం లేదన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను, కార్మికులను ఆదుకోవాల్సిన అధికార టిడిపి కూటమి మొసలి కన్నీరు కారుస్తుందన్నారు. జిల్లాలోని అన్ని సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎంపీ సిఎం.రమేష్ నేడు నోరు మెదపడం లేదన్నారు. కూటమి భాగస్వామ్యం పక్షమైన జనసేన చోడవరం ఇన్‌ఛార్జి పివియస్ఎన్.రాజు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి సుగర్ ఫ్యాక్టరీ సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని మొన్నటి వరకు చెప్పి, ఇప్పుడు ఉద్యమాలు చేస్తామని ప్రకటనలు చేస్తే రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. మరో భాగస్వామ్య పక్షం బిజెపి సుగర్ ఫ్యాక్టరీ రైతులకు న్యాయం చేయాలని ప్రకటనలు చేసి చేతులు దులుపుకుంటుందని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నది ఎవరు? ఉద్యమాలు ఎవరిపైన చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి నాయకులు నాటకాలు కట్టిపెట్టి రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని, ఫ్యాక్టరీ ఆధునికీకరణకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించే విధంగా ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

2న టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీగౌరీ గ్రంథాలయంలో మార్చి 2న ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ప్రముఖ పోటీపరీక్షల శిక్షణా కేంద్రం శ్రీధర్ సీసీఇ ఆధ్వర్యంలో 'ఏపీ పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్' టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనదలిచిన విద్యార్థులు https://forms.gle/UQtJfX9XpEsJhL3o6 లింక్‌ను క్లిక్ చేసి తమ పేర్లను ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టాలెంట్ టెస్ట్ విజేతలలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వరుసగా రూ.10,116, రూ.5,116, రూ.3,116, నాలుగు నుంచి 10 బహుతులకు రూ.1,116 చొప్పున అందజేస్తామని చెప్పారు. విధంగా ప్రొత్సాహక బహుమతులు కూడా ఉంటాయన్నారు. వివరాలకు 9326688899 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మల్లికార్జున స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పెదనాయుడుపాలెం శివారు గణపతినగరం గ్రామంలో శ్రీగణపతి భ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయం మొదటి వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి, పెందుర్తి నియోజకవర్గం వైసిపి నాయకులు గండి రవికుమార్, వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాద్, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, మాజీ సర్పంచ్ ధనిమిరెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ సబ్బవరపు నాగేంద్ర, వార్డ్ మెంబర్లు రామకృష్ణ, శివ, కిల్లి వెంకట సత్యనారాయణ, గోవింద్, సబ్బవరపు సత్యనారాయణ, సబ్బవరపు నాగభూషణం, సబ్బవరపు సత్యనారాయణ (బుజ్జి), సిరపరపు వాసు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కె.కోటపాడు : కే కోటపాడు మండల కేంద్రంలోని గౌరీ పరమేశ్వరుల దేవాలయం తొమ్మిదవ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. పురోహితులు గోరు గుంత రమేష్ బాబు ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల కళ్యాణం జరిగింది. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం సారె ఊరేగింపు బ్యాండ్ మేళాలతో బాణసంచా వెలుగులతో నిర్వహించారు. శ్రీ గౌరీ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు శరణం సన్యాసినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూరిశెట్టి మాధవరావు రామకృష్ణ వేగి రామారావు, వేగి గిరి, పెంటకోట సీతారాం, సూరిశెట్టి ఎరుకు నాయుడు, పెంటకోట శివ వెంకట ప్రసాద్, నాగేశ్వరరావు, వేగి అర్జున పీల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని శివాలయం నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన పండూరి ప్రసాద్ (ఈనాడు) కుమారుడు పండూరి చైతన్య రూ.50,116 విరాళం శుక్రవారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్ , కోరాడ శ్రీనివాసరావు, చింతల శ్రీను, ముర్రి కనకరాజు, జగ్గారావు, బర్ల నారాయణ పాల్గొన్నారు.

తైపురం సచివాలయంలో ఆధార్ సేవలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని తైపురం, ఆర్.శివరాంపురం సచివాలయం ఆధార్ సేవలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గుర్రం కోటేశ్వరరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ సేవలు మొబైల్ నెంబర్ లింక్, పుట్టిన తేదీలు మార్పులు, చేర్పులు, బయోమెట్రిక్ అప్డేట్ తదితర సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ నాగేశ్వర్రావు, వెల్ఫేర్, అసిస్టెంట్ అప్పారావు, మహిళా సంరక్షణ కార్యదర్శి దివ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

శృంగవరంలో ఘనంగా సీతారాముల తీర్థం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని శృంగవరం గ్రామంలో శుక్రవారం శ్రీసీతారాముల తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. గ్రామస్తులంతా ఉదయం నుండే సీతారాములవాడిని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బాలికల కబడ్డీ పోటీలను నిర్వహించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆటగాళ్లను పరిచయం చేసుకొని బాలికల కబడ్డీ పోటీలను ప్రారంభించారు. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రొంగలి మహేష్, కొట్టాన ఈశ్వరరావు, కన్నూరు సూర్యనారాయణ, పూడి నారాయణమూర్తి, నారెం తాతబాబు పాల్గొన్నారు.

హెచ్‌ఎస్‌ఎల్‌కు రెండు ప్రతిష్టాత్మక అవార్డులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఢిల్లీలో శుక్రవారం జరిగిన గవర్నెన్స్ నౌ 11వ పిఎస్‌యు అవార్డుల ప్రదానోత్సవంలో హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) మరోసారి రెండు ప్రతిష్టాత్మక అవార్డులను గెలుచుకుంది. గవర్నెన్స్ నౌ అవార్డులు దేశ పురోగతికి పిఎస్‌యుల ప్రభావవంతమైన సహకారాన్ని గుర్తిస్తాయి. వివిధ సంస్కరణలు, వ్యూహాత్మక విధానాలు, వినూత్న ఇంజినీరింగ్ సొల్యూషన్స్ అమలు చేసినందుకు హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ (స్ట్రాటజిక్ ప్రాజెక్ట్స్) గిరిదీప్ సింగ్ 'ఆపరేషన్స్ లీడర్‌షిప్' అవార్డును అందుకున్నారు. హెచ్ఎస్ఎల్ విజిబిలిటీ, బ్రాండింగ్, డిజిటల్ ఫుట్ ప్రింట్, గ్లోబల్ అవుట్ రీచ్‌లను పెంపొందించినందుకు గుర్తింపుగా నీలిమా బోని 'కమ్యూనికేషన్ అవుట్ రీచ్' అవార్డును అందుకున్నారు. పిఎస్‌యు కేటగిరీలో గనుల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, మానవ వనరుల శాఖ మాజీ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్‌లతో పాటు మహారత్న, నవరత్న, మినీరత్న, రాష్ట్ర పిఎస్‌యు కేటగిరీలకు చెందిన సంస్థల నుంచి హెచ్ఎస్ఎల్ ప్రతినిధులు ఈ అవార్డులను అందుకున్నారు.



అవార్డు స్వీకరిస్తున్న గిరిదీప్ సింగ్

హత్య కేసులో ఇద్దరు మహిళల అరెస్టు

ప్రజాశక్తి-దేవరపల్లి : మండలంలోని రైవాడలో ఈ ఫిబ్రవరి 23న లారీ డ్రైవర్ వారాధి రమణ హత్య కేసులో ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన ముద్దాయి మోసురు చల్లాయమ్మ, వారాధి రమణకు మధ్య సుమారు పది సంవత్సరాల నుండి వివాహేతర సంబంధం ఉంది. అయితే రమణ తరువాత కొమరాడ గ్రామానికి చెందిన కృష్ణవేణి అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఈ సమయంలో రమణ మద్యానికి బానిసై ఎప్పటికప్పుడు ఇంట్లో భార్యని, తల్లిని కొడుతున్నాడు. అతని బాధ భరించలేక భార్య పిల్లలను తీసుకొని వారి కన్నవారి గ్రామమైన కొమరాడ గ్రామానికి వెళ్ళిపోయింది. అదే సమయంలో అతని తల్లి విశాఖలో ఉన్న తన మనవరాలు చంద్రమణి వద్దకు వెళ్ళిపోయింది. రమణ ఇంకా ఎక్కువగా మద్యానికి బానిసై చల్లయ్యమ్మతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి డబ్బులు ఇవ్వాలని చల్లాయ్యమ్మను తరచూ కొడుతున్నాడు. ఫిబ్రవరి 23న పగలు మద్యం తాగి ఇరువురు కొట్లాడుకున్నారు. ఆ సమయంలో ఇంటి పక్క వారు చల్లాయమ్మ మేనల్లుడు మహరాజ్ దేవరాజు వచ్చి నచ్చజెప్పి ఇరువురిని మందలించారు. తరువాత అదే రోజు చల్లాయమ్మ, అతని అక్క కూతురు అయిన ఎస్ కోట గ్రామానికి చెందిన కోసూరి లక్ష్మీని తన ఇంటికి రప్పించుకుంది. రమణ అదేరోజు రాత్రి మద్యం బాగా తాగి మళ్ళీ చల్లాయమ్మ ఇంటికి వచ్చి తనతో గొడవపడి తనని కర్రతో కొట్టాడు. ఆ సమయంలో చెల్లాయమ్మ, లక్ష్మీ ఇరువురు అతనిని ఈ రాత్రి చంపాలని నిర్ణయించుకొని, సుమారు రాత్రి 11-12 గంటల మధ్యలో రమణ ఇంటికి వెళ్లారు. ఇంటిలో మంచంపై మద్యం సేవించి పడుకొని ఉండగా, చెల్లయ్యమ్మ, లక్ష్మీ ఇరువురు ఇంట్లోకి వెళ్లి కర్రతో రమణను నెత్తిమీద కొట్టింది. రమణ కేకలు వేయగా ఇంతలో చల్లాయమ్మ అదే మంచంపై ఉన్న తలగడను తీసి రమణ ముఖంపై పెట్టి గట్టిగా అదిమి పట్టుకోగా, కోసూరి లక్ష్మి అతని చేతులు పట్టుకొని అతడి ఊపిరి ఆడకుండా చంపేశారు. వీరిని శుక్రవారం అరెస్టు చేసి ఇద్దరినీ జ్యుడీషియల్ కస్టడీ నిమిత్తం కోర్టుకు పంపించారు. విలేకర్ల సమావేశంలో ఎఐ టి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీసు విభాగంలో విధులు నిర్వర్తించి, పదవీ విరమణ పొందిన ఎస్‌బి ఏఎస్ఐ ఆడారి వెంకట సన్యాసిరావుకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ ఆడారి వెంకట సన్యాసిరావు క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వహించారని తెలిపారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అలాగే, అవసరమైనప్పుడు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, ఏఓ ఎ.రామకుమార్, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ మూర్తి, బాల సూర్యరావు, రమేష్, రామకృష్ణారావు పాల్గొన్నారు.

టీబీ ముక్త పంచాయతీలుగా మూడు గ్రామాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రధానమంత్రి టీబీ ముక్త పంచాయతీలుగా మండలంలో మార్టూరు, రామన్నపాలెం, ఖాజీపాలెం గ్రామాలను ఎంపిక చేసినట్లు జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ ప్రాధ్యాధికారి డాక్టర్ ఎంఎస్ వి కె బాలాజీ తెలిపారు. అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం టిబి సంబంధిత లక్షణాలు, పరీక్షల గురించి గ్రామపంచాయతీ కార్యదర్శులకు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్త పంచాయతీలు వాటి ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వి కనక అప్పారావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె శ్రావ్య, కమిటీ హెల్త్ ఆఫీసర్ వేణుగోపాల్ డిపిఎస్ రామకృష్ణ, టిఎస్ ఎవి రమణ ఎన్పిఎల్ఎస్పి పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు బెంచీల వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి రోటరీ క్లబ్ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అనకాపల్లి జీవీఎంసీ హైస్కూల్లో గల జూనియర్ కాలేజీకి సభ్యుల సహకారంతో పిల్లలకు కూర్చోవడానికి 20 బెంచీలను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుల సరిపల్లి రాజేష్, సెక్రటరీ అనిల్ రఘురాం జోహార్, రాజేశ్వరి, ప్రసాద్, రోటరీ పబ్లిక్ ఇమేజ్ చైర్ బుద్ధ రమణాజీ, సర్వారం శేషగిరి, బుద్ధ శ్రీనివాసరావు, కన్నబాబు, బుద్ధ సత్యనారాయణ, అధిక సంఖ్యలో సభ్యులు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని ఉపాధి హామీ కూలీల నిరసన


పని ప్రదేశంలో నిరసన తెలుపుతున్న కూలీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

ఉపాధి హామీ చట్టం కింద చేసిన పనులకు ఆరు వారాల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరుతూ మండలంలోని గరిశింగి పంచాయతీ పరిధి చిన్న గంగవరం, యాలం బయలు, సంతపాలెం, రేగుల బంధం గ్రామాలకు చెందిన కూలీలు శుక్రవారం ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కమిటీ సభ్యులు బిటి దొర మాట్లాడుతూ సుమారు 6 వారాల నుండి వేతన బకాయిలు చెల్లించలేదని తెలిపారు. దేవరాపల్లి మండలంలో కోటి రూపాయల వరకు వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. తక్షణమే బకాయిలు చెల్లించాలని, పే స్లిప్పులు ఇవ్వాలని, ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోమల బాబూజీ, కింతాడ మరిడయ్య, సోమలు పైడితల్లి, సోమల సన్యాసమ్మ, అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆరు వారాల బకాయి వేతనాలు చెల్లించాలి : సిఐటియు

పరవాడ : మండలంలో ఉపాధి హామీ కార్మికులకు బకాయి పడ్డ ఆరు వారాల వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలో తానాం గ్రామంలో ఉపాధి హామీ కార్మికులతో పని ప్రాంతంలో గనిశెట్టి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం వేతనాలు చెల్లించాలని, పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని, తట్ట, పార, గుణపాం వంటి పనిముట్లకు డబ్బులు చెల్లించాలని, మంచినీరు, టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు అప్పారావు, నాయుడు, పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి

ఆశాజనకంగా ఆరుతడి పంటల సాగు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో రవి సీజన్లో సాధారణ విస్తీర్ణం కంటే ఎక్కువగా అపరాల సాగు జరిగిందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడిఆర్ డాక్టర్ సిహెచ్ ముకుందరావు తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ సందర్శన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వివిధ పంటలు పూతదశలో ఉన్నాయని, నువ్వు పంట వివిధ దశల్లో ఉందని తెలిపారు. వరి సాధారణ విస్తీర్ణంలో 47శాతం నాట్లు వేశారని చెప్పారు. పెసర, మినుము పంటలలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు, అధిక ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. వివిధ పంటల స్థితిగతులు, వివిధ పంటల్లో చీడపీడల సమస్యలపై జిల్లా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చర్చించి సలహాలు సూచనలు అందించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండు విచ్చేసిన ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి సహదేవ రెడ్డి, డాక్టర్ తేజస్‌రావు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక, పంటల సరళి మార్పు అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిలక్ష్మి, డాక్టర్ సిహెచ్ శ్రీలత, డాక్టర్ కెవి రమణమూర్తి, డాక్టర్ బి భవాని, వ్యవసాయ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వినియోగదారుల అవగాహనా సదస్సు

ప్రజాశక్తి- అనకాపల్లి : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రాయ్ రీజినల్ ఆఫీస్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో స్థానిక డైట్ కాలేజీలో టెలికాం వినియోగదారుల అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ట్రాయ్ జాయింట్ అడ్వైజర్ వివిఎస్ రాజు, బిటిఎస్ డైరెక్టర్ జీవి మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఇండియాలో టెలికాం రంగంలో సాధించిన అభివృద్ధి, వినియోగదారుల వాడకం, ఫిర్యాదుల సేకరణ వాటి పరిష్కార మార్గాలు గురించి, ట్రాయ్ ఆప్స్ గురించి, టవర్స్‌పై జరుగుతున్న మోసాలపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ నుంచి ఈ సిమ్‌లను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె గణేష్ ప్రసాద్ రెడ్డి, బేసిక్ సైన్సు విభాగాధిపతి డాక్టర్ పి పవిత్ర, సిహెచ్ బిక్షం, సి ఉదయ్ కుమార్, టెలికం ఆపరేటర్స్ ఎయిర్టెల్, బిఎస్ఎన్ఎల్, ఆర్జెఐఎల్, కంపెనీ ప్రతినిధులు, విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-సబ్బవరం

మండల కేంద్రంలోని మార్చి 1 నుండి నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీ చీఫ్ సూపరింటెండెంట్ పి.సుభాషిని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ పబ్లిక్ పరీక్షలకు డిపార్ట్మెంటల్ ఆఫీసర్‌గా కేవీ రాధికను నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో పది రూముల్లో మౌలిక వసతులతో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రతి రూములో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆన్లైన్లో అనకాపల్లి జిల్లా కేంద్రంకు, రాష్ట్ర కేంద్రం విజయవాడకు అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు, మాస్ కాపీయింగ్‌కు ఎటువంటి అవకాశం లేకుండా పక్కా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రథమ సంవత్సరం 306 మంది, ద్వితీయ సంవత్సరం 323 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. వికలాంగ విద్యార్థులకు ప్రత్యేక రూము ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

మండల కేంద్రంలో ఇంటర్ పరీక్షలకు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కాలేజ్‌లో పరీక్ష కేంద్రంలో ఇంటర్ ఫస్ట్‌ఇయర్ 278 మంది ఇంటర్ సెకండ్ ఇయర్231 మంది ప్రైవేటుగా 39 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎన్. రామకృష్ణ తెలిపారు. డిపార్మెంటల్ ఆఫీసరుగా జే.ఎస్.ఎన్ ప్రభ ను నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో అన్ని మౌళిక వసతులతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నక్కపల్లి : నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఈనెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల కళాశాల ప్రిన్సిపల్ కే శ్రీదేవి, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సువర్ణ రత్నకుమారి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి 446, రెసిడెన్షియల్ కళాశాల నుండి 594 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు పరీక్షా సమయానికి అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసామన్నారు.

మాడుగుల : మాడుగుల జూనియర్ కళాశాలలో ఈనెల 1వ తేదీ శనివారం నుండి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించి కళాశాలలో అన్ని ఏర్పాట్లు కట్టు దిట్టం చేశారు. ఏర్పాట్లు సంబంధించి ఇన్చార్జి ప్రిన్సిపాల్, పరీక్ష నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్ ఆర్ నీలిమ మాట్లాడుతూ, పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మాడుగుల జూనియర్ కళాశాల తో పాటు, వద్దాది జూనియర్ కళాశాల, గాయత్రి జూనియర్ కళాశాల, సురవరం కెజిబివీ కళాశాల లో 500 మంది విద్యార్థులు పరీక్షలు రాయను న్నారన్నారు. విద్యార్థులకు పరీక్ష సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, వైద్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

భీమునిపట్నం : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల ఒకటి నుంచి 20వ తేదీ వరకు జరుగనున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో చుట్టుపక్కలున్న 11 ప్రైవేట్ కళాశాలలకు చెందిన 566 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పరీక్షాకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎన్ రామమూర్తి, డిపార్ట్‌మెంటల్ అధికారి వైవి అప్పారావు తెలిపారు. . ఇక్కడ చదివిన 626 మంది విద్యార్థులు వేర్వేరు కళాశాలల్లో పరీక్షలు రాస్తారని తెలిపారు శుక్రవారం పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లపై వివరించారు.


భీమిలి పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 19 తరగతి గదులు న్నాయని, అన్ని చోట్ల సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెల్ ఫోన్లు పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. సరిపడా ఫర్నిచర్, విద్యుత్, తాగునీటి సదుపాయం ఉందన్నారు. మార్చి 1న తెలుగు, సంస్కృతం, జనరల్ ఫౌండేషన్ కోర్సు (జీఎఫ్‌సి) పరీక్ష ఉంటుందన్నారు.జంబ్లింగ్ పద్ధతి లో విద్యార్థులకు పరీక్షా కేంద్రాల కేటాయింపు, పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

ఆనందపురం : ఈనెల ఒకటి నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్ఐఒ మురళీధర్ తెలిపారు. పెద్దిపాలెం భవిష్య జూనియర్ కళాశాల, బిపి కల్లాలు వివేకానంద జూనియర్ కళాశాల, ఎస్సార్ కళాశాల,ఈస్టర్న్ విశాఖ కళాశాల, బోయపాలెం శశి కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతోపాటు పోలీసుల భద్రత, సిసి కెమెరాల నిఘా ఉంటుందని తెలిపారు.

ప్రజాశక్తి 7
శనివారం 1 మార్చి 2025

ఘనంగా సైన్స్ దినోత్సవం



శ్రీ ప్రకాష్‌లో సైన్స్ ప్రదర్శనను వివరిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు సైక్వెస్ట్ పేరున ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, క్రామ్సన్ రీసెర్చ్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్, (హైదరాబాద్)డాక్టర్ విజయ్ విట్టల్ టి.మతాడ్, గౌరవ అతిథిగా ఆంధ్రా విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ అఫ్ కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కె.వి. రమేష్ హాజర్యయారు. జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం విజయ్ విట్టల్ టి.మతాడ్ మాట్లాడుతూ, మనిషి జీవితంలో అసలు సంపద అనేది ఆవిష్కరణ, సృజనాత్మకత మీద ఆదారపడి ఉంటుందని, విద్యార్థులు బట్టీ పట్టే విధానం కాకుండా మేధోపరమైన చదువు ద్వారానే మంచి పురోగతి సాధించగలరని సూచించారు.

ప్రొఫెసర్ కె.వి. రమేష్ మాట్లాడుతూ, విద్యా జ్ఞానం కంటే నైపుణ్యాలు చాలా గొప్పవని, విజేతలు కావాలంటే పరిశీలనా నైపుణ్యాలు అవసరమని, వీటి ద్వారా వ్యక్తి అభివృద్ధితో పాటుగా దేశ అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రములు, జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కంటిపూడి నరేంద్ర బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. రామకృష్ణా రెడ్డి, డైరెక్టర్ హెచ్ఆర్ బంగార్రాజు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని నక్కపల్లి,ఉద్దండపురం, రాజయ్యపేట, డిఎల్ పురం, పెదబోదుగల్లం, వేంపాడు, దేవవరం తదితర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ వైజ్ఞానిక ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎంఈఓలునరేష్, వేమగిరి నూకరాజు సందర్శించి సైన్స్ ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక శ్రీచైతన్య ఆంగ్లమాధ్యమ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశాఖపట్నం డిస్ట్రిక్ట్ లైన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ అధికారి గోపాలరావు, రిటైర్డ్ సైన్స్ ఉపాధ్యాయులు ఆనందరావు మాస్టర్ జ్యోతి ప్రజ్వలనం చేసి సివి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. విద్యార్థులకు సంస్థ ఏజిఎం సురేష్, ప్రాంతీయ సంచాలకులు ఎం.రమణ, మెయిన్ జెడ్.ఎ.సి.ఓ లెంక రాజేష్, ఎన్.వి.రమణ అభినందనలు తెలిపారు. డీన్ వానపల్లి నాగేశ్వరరావు, ఇన్చార్జులు గోవిందరావు, మైథిలి, ప్రమీల, ఏవో పాండురంగ నాయుడు పాల్గొన్నారు.

రావికమతం:మండలంలో మరుపాక ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ కే సత్య సునీల్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులు పలు రకాల సైన్స్ ప్రాజెక్ట్స్ ను ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేశారు.వివిధ రకాల మోడల్స్ ప్రదర్శన చేశారు.

మాడుగుల:మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి వి ఎస్ ఎస్ శాస్త్రి సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోజాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కె.సత్యారావు సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రతి వ్యక్తి తాను చేసే పనులలో సైన్సు ఇమిడి ఉంటుందన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు సత్యారావు సైన్స్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు వెంకట్, ఈశ్వరరావు, అప్పారావు, డివిజే అప్పారావు, అప్పలరాజు పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక శ్రీవిజ్ఞాన్ స్కూల్లో సైన్స్ డే సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎంఎంకె రాజు, ప్రిన్సిపల్ జ్ఞానేశ్వరి నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన సుమారు 600 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమశేఖరన్, పి.శ్రీనివాసరావు, కెవిఎస్ మన్యం, గోవింద్, రఘు, ప్రసాద్ పాల్గొన్నారు.



చోడవరం శ్రీ విజ్ఞాన్‌లో ప్రదర్శన

అచ్యుతాపురం :విద్యార్థులు సైన్స్ పట్ల దృష్టి సారించాలని భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎంవి సూర్యనారాయణ అన్నారు. అచ్యుతాపురం కైట్స్ విద్యా సంస్థలో సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు తయారు చేసిన పలు సైన్స్ పరికరాలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను డాక్టర్ సూర్యనారాయణతో పాటు డిఎస్‌పి బోను అప్పారావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం సత్యపద్మ తదితరులు పరిశీలించారు. కైట్స్ కరస్పాండెంట్లు రెడ్డి చిరంజీవి, రెడ్డి గణేష్, ప్రిన్సిపాల్ రెడ్డి ప్రసన్న, డైరెక్టర్ రెడ్డి ప్రియాంక, రామన్నపాలెం గ్రామ సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, మాజీ సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని కొక్కిరాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా బివిఎస్ సాయిబాబా, మాజీ కౌన్సిలర్ పెయ్యల రామకృష్ణ మాట్లాడారు. విద్యాకమిటీ వైస్ చైర్‌పర్సన్ వీసం ధనలక్ష్మి, హెచ్‌ఎం ఆకుల పాపాజీరావు, జి.అనూష, సుజాత, అమ్మాజీ, హసీనా పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని మేడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం జి.శివానంద ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఎంఈఓలు సత్యనారాయణ, డివిడి ప్రసాద్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నమూనాలను ప్రదర్శించారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం గాయత్రి పాఠశాలలో యాజమాన్య సభ్యులు ఐ.అప్పారావు, కరస్పాండెంట్ బి.రామ్‌కుమార్, హెచ్‌ఎం వై.నగేష్ సర్ సివి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కశింకోట బాలికలు హైస్కూల్‌లో ఎంఇఓలు సురేష్, సూర్యనారాయణమూర్తి, హెచ్‌ఎం ఎంఎస్. స్వర్ణ కుమారి, బాలుర హైస్కూల్‌లో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అచంటి రవి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ జెడ్‌పి హైస్కూల్‌లో మండలం స్థాయిలో పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి అప్పలనాయుడు, డాక్టర్ విఎన్ కృష్ణమూర్తి పాల్గొన్నారు. పరవాడ సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగాలను పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి తిలకించారు. మనిషి మనుగడకు సైన్స్ కీలకమని అమే పేర్కొన్నారు. సీఈఓ కె.నిశాంత్ పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి అక్షర ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ బి.అప్పారావు, ఎంఈఓలు ఎస్.లక్ష్మణరావు, రవీంద్రబాబు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయ బాబు ముందుగా సివి రామన్ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. క్విజ్, నమూనా ప్రాజెక్టు పోటీలు నిర్వహించి మొదటి మూడు స్థానాలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఫిజిక్స్ హెడ్ టి.నిరంజన్ కుమార్, సూపరింటెండెంట్ పి.అనురాధ పాల్గొన్నారు.

మామిడిపాలెం జడ్పీ హైస్కూల్‌లో సివి రామన్ విగ్రహానికి హెచ్‌ఎం హెచ్‌బి. శ్రీధర్, టీచర్లు పూలమాలలు వేశారు. విజేతలకు సర్పంచ్ పూడి పరదేశి నాయుడు చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

ఎంవిపి.కాలనీ : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంవిపి ఉషోదయ జంక్షన్‌లోగల కిడ్జ్ గార్డెన్ స్కూల్‌లో సైన్సు ఫెయిర్ – 2025 ఏర్పాటు చేశారు. ఇది ఎంతగానో ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా హాజరైన ఎయు ప్రొఫెసర్ ఈశ్వర్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలల్లో విజ్ఞానదాయక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ బాలలు చిన్నతనంలోనే సైన్స్ పట్ల శ్రద్ధాశక్తులు ప్రదర్శిస్తే భవిష్యత్తులో దేశం గర్వించే శాస్త్రవేత్తలు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సాయిలక్ష్మి మాట్లాడుతూ, వచ్చే విద్యాసంవత్సరం నుంచి తమ పాఠశాల పేరును ఆర్క్ వ్యాలీ స్కూల్‌గా మారుస్తున్నామన్నారు.



రాయిపాలెంలో తిలకిస్తున్న ఎంపిడిఒ, హెచ్‌ఎం

భీమునిపట్నం : తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో సివి రామన్ జీవిత విశేషాలపై విద్యార్థులకు క్విజ్, పోస్టర్, ఆర్ట్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.ప్రిన్సిపాల్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ చంద్రశేఖర్, ఐఐసి కో ఆర్డినేటర్ షరీఫ్ పాల్గొన్నారు. బాసర లీడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సైన్స్ డేలో ప్రిన్సిపాల్ రేఖ, డీన్ భాస్కరరావు, హెచ్‌ఎం కేశవ్. సన్ స్కూల్‌లో కరస్పాండెంట్ కె శ్రీనివాస్, గొల్లల పాలెం కెజిబివిలో సైన్స్‌డేలో ఎస్ఎస్ఎ ఎపిసి జె చంద్రశేఖర్‌రావు , ప్రిన్సిపాల్ గంగాకుమారి, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె మనీషా, ప్రిన్సిపాల్ ఆర్ మంజుల, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ విష్ణు మూర్తి, రాయిపాలెం,జివిఎంసి హైస్కూల్‌లోఎంపిడిఒ ఎన్ హనుమంతరావు, హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, తాటితూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం, కె సన్యాసినాయుడుపాల్గొన్నారు.

ఆరిలోవ : విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని విజ్ఞానప్రదర్శనలు దోహదపడతాయని మాజీ డిజిపి నండూరి సాంబశివరావు అన్నారు 10వ వార్డు ఆదర్శనగర్ శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్లో కిడ్డోస్ సైన్స్ ఫెస్ట్‌లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ముని మోహన్‌కృష్ణ మహిళా సైంటిస్ట్ రజని విలియమ్స్ పాల్గొన్నారు.

మధురవాడ : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ, ఎస్‌సివిటి ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఎపిసి డాక్టర్ జె.చంద్రశేఖర్రావు, పి. దేముడుబాబు, పి. రాజారావు, జి. రవి, విద్యాకమిటీ చైర్మన్ జి అచ్యుతారావు పాల్గొన్నారు.

గాజువాక. : గాజువాక బిసి రోడ్ సాయి విద్యానికేతన్‌లో సైన్స్ ఎక్స్‌పోను జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎస్‌విక. పరశురాం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి. లక్ష్మణరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు వాసుదేవరావు, ఎం.సింహాచలం, ఎం త్రినాధరావు, లక్ష్మణరావు, కెవి.సత్యనారాయణ ఎం. రంగనాథ్, మహేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.జివిఎంసి 76వ వార్డు గిరీష్ విద్యానికేతన్ కరెస్పాండెంట్ బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు రూపొందించిన 200 సైన్స్ డే ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో సైన్స్ డే నిర్వహించారు.పిన్సిపాల్ ఎన్ఇ ఫ్లోరా, కరస్పాండెంట్ టి.థియోఫిలస్ పాల్గొని సైన్స్‌ఎక్స్‌పోను తిలకించారు. .రాజా బ్లడ్ బ్యాంకు క్యాంప్ మేనేజర్ గీతా విశ్వనాథ్, హెచ్ఆర్ మేనేజర్ ఎస్.సత్యనారాయణవిజేతలకు బహుమతులు అందజేశారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌డికె రాజు, ఎఇ రవి బాబు, ఫిజిక్స్ లెక్చరర్ డిటి.రమ్య, కోర్డినేటర్లు మంజుల, ఎన్ సంధ్యారాణి, డీస్ ప్రదీప్, సింహాచలం పాల్గొన్నారు.

సీతమ్మధార : ప్రిజం డిగ్రీ పిజి కళాశాలలో సైన్స్‌డేలో సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సత్యశ్రీ ముఖ్య పాల్గొని. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను తిలకించారు.

ములగాడ: మల్కాపురం, జనతా కాలనీ ప్రియదర్శిని ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సైన్స్ ఎక్స్‌పోను ఎంఇఒ డివి.త్రినాధరావు ప్రారంభించారు. విద్యార్థుల ప్రాజెక్టు నమూనాలను పరిశీలించారు. హెచ్‌ఎం వైవి ప్రసాదరావు, డైరెక్టర్ విఎ.రావు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు పరశురాం, మండల కార్యదర్శి వాసుదేవరావు, నాయకులు త్రినాథరావు, ఎస్.లక్ష్మణరావు, రంగనాథ్, సత్యనారాయణ పాల్గొన్నారు

మధురవాడ: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సర్ సివిరామన్ విగ్రహానికి శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీతలు ప్రొఫెసర్ రాఘువేంద్ర గడాగ్‌కర్, ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ హాజరై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీతం విసి ఎరోల్ డిసౌజా, గీతం స్కూల్ ఆఫ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి అధ్యాపకులుపాల్గొన్నారు.

పరీక్షల వేళలకు అనుగుణంగా

బడి బస్సులు అందుబాటులో ఉంచాలి

-డిపో మేనేజర్‌కు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:పదో తరగతి, ఇంటర్ పరీక్షల సమయాల్లో బడి బస్సులు సరైన సమయాల్లో అందుబాటులో ఉంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గౌతమ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం నర్సీపట్నం ఆర్టీసి డిపో మేనేజర్ ధీరజ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం గౌతమ్ మాట్లాడుతూ, ఈనెల 1 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, చాలామంది విద్యార్థులు దూర ప్రాంతాల నుండి పరీక్షలు రాయడానికి వస్తుంటారని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి అందుకునే విధంగా బడి బస్సులను నడపాలని కోరారు. తుని, చోడవరం, అడ్డరోడ్డు, అనకాపల్లి, చింతపల్లి, కేడిపేట బస్సులు పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని కేజే పురం జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్.ఎం.ఎం.ఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్) ఎంపిక అయ్యారు. ఈ పాఠశాలలో చదివుతున్న విద్యార్థులు గ్రీష్మ శ్రీ, శ్రావణ్ కుమార్ ఇద్దరు ఎంపికై ప్రతిభను చాటుకున్నారు. సెంట్రల్ గవర్నమెంట్ పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం 12 వేల చొప్పున 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు స్కాలర్షిప్ అందిస్తుంది. ఈ ఇద్దరు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పొలిమేర చంద్రరావు పరీక్షకు ఆరు నెలల ముందు నుండి ప్రతిరోజు సాయంత్రం పిల్లలందరికీ గ్రాండ్ టెస్టులు నిర్వహించారు. దీనికి గాను విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.



శ్రవణ్ కుమార్



గ్రీష్మశ్రీ

టెన్త్‌లో అధిక మార్కులు సాధిస్తే బహుమతులు

ప్రజాశక్తి-కొత్తకోట:మండలలోని కొత్తకోట హైస్కూల్‌లో చదివే టెన్త్ విద్యార్థులు టెన్త్‌లో అధిక మార్కులు సాధిస్తే బహుమతులు అందజేస్తానని, హెడ్ కానిస్టేబుల్, కొత్తకోట ఎంప్లాయిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జాలిపర్తి నిరంజన్ తెలిపారు. సైన్స్ డేను పురస్కరించుకొని ప్రత్యేక అతిథిగా విచ్చేసిన నిరంజన్ మాట్లాడుతూ, ప్రస్తుత సంవత్సరం 10వ తరగతిలో బెస్ట్ స్కోర్స్ సాధించిన విద్యార్థిని విద్యార్థులకు మొదటి బహుమతి రూ. 5000, రెండవ బహుమతి రూ.3000, 3వ బహుమతి రూ.2000 అందజేస్తానన్నారు. తన అమ్మ, కీర్తిశేషులు జాలిపర్తి సుజనమ్మ జ్ఞాపకార్థంగా బహుమతులు అందజేస్తానని తెలిపారు.



హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-గొలుగొండ:మహాశివరాత్రి పురస్కరించుకొని గొలుగొండ మండలం ధారమట్టం ఉమాధారమల్లేశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమంను శుక్రవారం నిర్వహించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ డీ.ఉమాదేవి, డివిజన్ కార్యనిర్వాహణాధకారి దివ్యతేజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మూడు రోజులకు గాను హుండి ఆదాయం రూ.78180 కాగా, టికెట్ల విక్రయ రూపంలో రూ.128,815 వచ్చినట్లు కార్యనిర్వాహణాధికారి దివ్యతేజ తెలిపారు. అనంతరం శివరాత్రి ఉత్సవాలకు సహాయ సహకారాలు అందించిన పాతమల్లంపేట టీడీపీ నాయకులు గెడ్డం ఆనంద్‌ను ఘనంగా సన్మానించారు.

గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మించాలి

ప్రజాశక్తి- మాడుగుల:గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రహదారి సదుపాయం ఉండాలని మండల అధ్యక్షులు తాళ్లపరెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తి విలేకరితో మాట్లాడుతూ, మండలంలో మారుమూలన ఉన్న గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రహదారులు అవసరమన్నారు. ఈ మేరకు అనకాపల్లి నుండి అల్లూరు జిల్లాను కలుపుతూ మాడుగుల నుండి రామచంద్రాపురం మీదగా తాటిపర్తి వరకు రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. జాలంపల్లి పంచాయతీ సిరిపురం నుండి చింతపల్లి మండలం తాజంగి దగ్గర అంజలి శనివారం వరకు మరో రోడ్డు, జాలంపల్లి పంచాయతీ మల్లెపాడు నుండి సోలభం వరకు రోడ్డు వేయాలన్నారు. అవురవాడ పంచాయతీ సీతబంధుల నుండి రావికవతం మండలం అజయపురం మీదగా జడ్ జోగంపేట వరకు, జాలంపల్లి పంచాయతీ బుట్ల జాలం పల్లి నుండి కింతల వల్లపురం పంచాయతీ పనస గదవ వీధి వరకు, అవరవాడ పంచాయతీ కాగితా నుండి జాలంపల్లి పంచాయతీ బుట్ల జాలం పల్లి వరకు రోడ్డు నిర్మాణాలు చేపట్టాలన్నారు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలలో ఎక్కువ అవినాభావ సంబంధాలు కలిగిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని అన్నారు.ఈ రోడ్డు పనులు పూర్తయినట్లయితే గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కలగడంతో పాటు పల్లెలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.



పరిశీలిస్తున్న డిఎస్‌పి

రంగురాళ్ల క్వారీని పరిశీలించిన డిఎస్‌పి

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం డిఎస్పి పోతిరెడ్డి శ్రీనివాసరావు శుక్రవారం గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం రంగురాళ్ల క్వారీను సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. క్వారీ వైపు ఎవరు వెళ్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని చెప్పారు. నిరంతరం గస్తీ ఉంచాలని సూచించారు. క్వారీకి ఎవరు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ పీ.రామారావు తదితరులు పాల్గొన్నారు.

సిఐఐ ఆధ్వర్యాన స్వర్ణాంధ్ర విజన్‌పై సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిఐఐ విశాఖపట్నం జోన్ వార్షిక సమావేశం శుక్రవారం ఉదయం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర విజన్ - 2029 విశాఖ రీజియన్ లీడింగ్ గ్రోత్ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వియంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ రాష్ట్ర అభివద్ధి అజెండాలో విశాఖకు వ్యూహాత్మక ప్రాముఖ్యత ఉందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న అంతరాలను తగ్గించడానికి తీసుకున్న చర్యలను వివరించారు. ప్రభుత్వం ఈ ఏడాది 15 నూతన రహదారుల్లో రూ.200 కోట్లు పెట్టుబడి పెట్టాలని యోచిస్తోందన్నారు. భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించడానికి ముందు రద్దీని తగ్గించే వ్యూహంతో సవరించిన మాస్టర్ ప్లాన్‌ను అభివృద్ధి చేస్తామని అన్నారు. నీతి ఆయోగ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ పార్థ సారథి రెడ్డి చేవూరు మాట్లాడుతూ పొడవైన తీరప్రాంతం, పటిష్టమైన ఓడరేవులు, హైవేలు, విమానాశ్రయాలు, రైలు నెట్‌వర్క్‌లు సహా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను ఆయన వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఈ సందర్భంగా సిఐఐ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ 2025-26 సంవత్సరానికి సిఐఐ విశాఖపట్నం జోన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. దక్కన్ ఫైన్ కెమికల్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డివిఎస్.నారాయణరాజు 2025-26 సంవత్సరానికి సిఐఐ విశాఖపట్నం జోన్ ఛైర్మన్‌గాను, ఇన్‌స్పైర్జ్ ఐటి సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ జి.కృష్ణమోహన్ వైస్ ఛైర్మన్‌గాను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎర్నెస్ట్ అండ్ యంగ్ స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అమిత్ మజుందార్, సిఐఐ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ, సిఐఐ విశాఖపట్నం ఛైర్మన్ రాజేష్ గ్రంధి పాల్గొన్నారు.

'ఉక్కు'ను రక్షించుకుంటాం

ప్రజాశక్తి-ఉక్కునగరం:స్టీల్‌ప్లాంట్ యాజ మాన్యం కార్మికుల మధ్య విభేదాలు సృష్టిస్తూ ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తే సహించేది లేదని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు యు.మరిడయ్య అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1478వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు కార్యకర్తలు, స్టీల్‌ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ఉక్కు కార్మికుల్లో యాజమాన్యం జూనియర్, సీనియర్ అన్న అంశాన్ని ముందుకు తీసుకొచ్చి వేతనాల చెల్లింపుల్లో వ్యత్యాసాన్ని చూపిస్తోందన్నారు. యువ కార్మికుల్లో ఉద్యమం పట్ల ఉన్న ఆవేశాన్ని అణచివేయాలన్న యాజమాన్య కుతంత్రాన్ని ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని స్పష్టం చేశారు. ఉక్కు ఉద్యమానికి ప్రజా మద్దతును తగ్గించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. వాస్తవ విషయాలను ప్రజలకు, కార్మికులకు వివరిస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డి.సత్యనారాయణ, సతీష్, కె.శ్రీనివాస్, డిసి హెచ్.వెంకటేశ్వరరావు, కె.దీనబంధు, ఆర్.సూరిబాబు, అప్పలరాజు, అంజి, ఎర్రయ్య పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి

విశాఖ కలెక్టరేట్:విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించడానికి చర్యలు వెంటనే చేపట్టాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి ఎం.వి త్రినాధ్ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 1457 వ రోజుకు చేరాయి. దీక్షల్లో పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ ను ఎట్టి పరిస్థితులలోనూ ప్రైవేటీకరణ చేయటానికి, యావత్ కార్మిక వర్గం, విశాఖ ప్రజలు అంగీకరించబోరన్నారు. దీనిని యధావిధిగా ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్నారు. స్టీల్ ప్లాంట్ ఖాళీ భూములను కాజెయ్యాలని కార్పొరేట్ సంస్థలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ నిర్వాసితులందరికీ ఉద్యోగాలు కల్పించాలన్నారు. సొంత గనులు కేటాయిం చాలన్నారు. అతి తక్కువ పెన్షన్ తో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈపిఎస్ 95 పెన్షనర్లకు కనీసం పెన్షన్ రూ.9 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. షిప్ యార్డ్ రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన పిఎఫ్ 2 శాతం బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.ఎం కుమార మంగళం, సూర్యచంద్రరావు, ఎస్. చలపతిరావు, డి.విజ్ఞానంద్, బి.వి.వి రమణ, గంగారావు, సువర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న మరిడయ్య

మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు

-పేరుకే పవన్ కల్యాణ్ సెక్యులర్ - ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ ధ్వజం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పేరుకే సెక్యులర్ అని అంటారని, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు రేపుతున్నారని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ పాల్ ఆరోపించారు. శుక్రవారం ఆశీలు మెట్ట వద్దనున్న కె.ఎ పాల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, డీ లిమిటేషన్ పై రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడక పోవడం దారుణమన్నారు. ఉత్తర భారత దేశంలో ఎంపిలను పెంచి,దక్షిణ భారత దేశంలో ఎంపి స్థానాలు తగ్గిస్తున్నారని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాల తమిళ, తెలుగు,కన్నడ భాషలు లేకుండా చేయాలని బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. తమిళనాడు ముఖ్య మంత్రి స్టాలిన్ ఇదే ఆరోపించారని, హిందీ భాషను రుద్దడానికి కేంద్ర ప్రభుత్వం 30 భాషలు లేకుండా చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో మహిళలకి, నిరుద్యోగులకు ఏం చెయ్యలేదని తెలిపారు. రూ.10 లక్షల కోట్లు అప్పు ఉందని చంద్రబాబుకి ముందు తెలియదా అని ప్రశ్నించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 30 వేల మంది మహిళలు తప్పి పోయారని గత ప్రభుత్వం హయాంలో అన్నారని, అధికారం లోకి రాగానే వారిని వెనక్కి రప్పిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.ఇప్పుడు పవన్ కళ్యాణ్ ఎంతమంది మిస్ అయిన మహిళలను తీసుకువచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్, వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీ కి వెళ్ళాలని, ముఖ్యంగా జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీ వెళితే ప్రతి పక్షం అనేది ఉంటుందన్నారు.

ప్రజలను నిరాశ పరిచిన బడ్జెట్

పలువురు నేతల విమర్శ

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజలను నిరాశ పరచిందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలకు పూర్తి స్థాయిలో కేటాయింపులు లేవన్నారు. గత ఏడాది ఆందోళన చేసిన అంగన్వాడీ, ఆశా, మున్సిపల్ వర్కర్లకు ప్రతిపక్షంలో ఉండగా న్యాయం చేస్తామని చెప్పి, ఇప్పుడు అధికారానికి వచ్చిన కూటమి తాజా బడ్జెట్లో వారికి మొండిచెయ్యి చూపిందన్నారు.

అంకెల గారడిలా రాష్ట్ర బడ్జెట్

నర్సీపట్నంటౌన్:కూటమి ప్రభుత్వం మొదటి సారిగా ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా లెక్కల గారడిలా ఉందని బీఎస్పీ నర్సీపట్నం నియోజకవర్గ నాయకులు బొట్టా నాగరాజు ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఈ బడ్జెట్ సామాన్యులకు ఎటువంటి ఉపయోగకరంగా లేదన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ బడ్జెట్‌లో సూపర్ త్రీకి పడిపోయిందన్నారు. కేవలం సూపర్ సిక్స్ అమలుకు సంబంధించిన పథకాల్లో కేవలం మూడింటికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారని, మిగిలినవి ఎన్నికల ముందు అమలు చేస్తారేమోనని హెద్దేవా చేశారు. బడ్జెట్ మొత్తం అంకెల్లో బాగుంది కానీ గత ప్రభుత్వాల మాదిరిగానే అమలులో ఏమీ ఉండదన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అన్నీ నెరవేర్చాలని, బడ్జెట్ అమలులో జవాబుదారితనం ఉండాలని అప్పుడే ప్రజలకు బడ్జెట్ వల్ల ప్రయోజనం ఉంటుందని తెలిపారు.

విద్యకు కేటాయింపులేవీ ?

విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర బడ్జెట్‌ను భారీగా ప్రవేశపెట్టినప్పటికీ రైట్ టు ఎడ్యుకషన్ చట్టం అమలుపైగానీ, జాతీయ విద్యా విధానం అములుపైగానీ రాష్ట్ర విద్యా విధానాన్ని ప్రకటించలేదని రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు తెలిపారు. కొఠారి కమిషన్ చెప్పిన దాని ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం పాఠశాల విద్యకు కేటాయించాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 9.86 శాతం అనగా రూ.31,806.కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఇవి ఏమాత్రమూ సరిపోవన్నారు. కనీసం 20 శాతం అయినా కేటాయిస్తే ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం కావడానికి ఎక్కువ అవకాశం ఉండేదన్నారు. ఉన్నత విద్యను కలుపుకుంటే 10.64 శాతం ఉందన్నారు. ప్రైవేటు విద్యారంగానికి అడుగులు వేయడానికి అవకాశం కల్పించేదిగా బడ్జెట్ ఉందన్నారు.

10వ తేదీలోపు కాంట్రాక్టర్లు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:పూర్వపు విశాఖ రీజియన్ (విశాఖపట్నం,అనకాపల్లి, అల్లూరి సీతా రామరాజు జిల్లాలు) పొరుగు సేవల కాంట్రాక్టర్లతో జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు శుక్రవారం తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్క కాంట్రాక్టర్ ప్రతీ నెల 5 వ తేది లోపు తమ తమ బిల్లులను డిపో, యూనిట్ లలో సమర్పించాలని, ప్రతి అవుట్ సోర్సింగ్ కార్మికునికి ప్రతీ నెల 10 వ తేదీ లోపు కనీస వేతనాలు చెల్లించాలని, అదేవిధంగా ప్రోవిడెంట్ ఫండ్,ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. కార్మికుల నుండి ఎటువంటి ఫిర్యాదులు (గ్రీవెన్స్) రాకుండా చూడాలని కోరారు.ఈ సమావేశంలో పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అకౌంట్స్ ఆఫీసర్ వి.వంశీ మోహిని, అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీధర్, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టర్స్, అవుట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.తత

సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాలి



అవగాహన కల్పిస్తున్న ఎఒ

ప్రజాశక్తి -నక్కపల్లి:సేంద్రీయ సహజ వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టే విధంగా ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నిర్వహించే సహజ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమా ప్రసాద్ మాట్లాడుతూ, వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటంతో ఆరోగ్య ఇబ్బందులు, పర్యావరణం కాలుష్యం అగుటకు ఆస్కారం ఉన్నందున రైతులందరూ సహజ వ్యవసాయం చేయాలన్నారు.ప్రకృతికి అనుగుణంగా వ్యవసాయం చేయడమే సహజ వ్యవసాయం అని, రైతులను ఆ విధంగా ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో రైతులకు సహజ వ్యవసాయం ఆవశ్యకతను వివరించాలని సూచించారు.

వెలుగు ఏపిఎం శ్రీనివాస్ మాట్లాడుతూ, మహిళా సమాఖ్య సమావేశాల్లో సహజ వ్యవసాయం ఆచరించే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు.

ఏపీ సిఎన్ఎఫ్ సిబ్బంది వెంకటలక్ష్మి, భవాని సహజ వ్యవసాయం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

త్వరలో పోలీస్ స్టేషన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించ నున్నట్లు సిఐ కుమారస్వామి, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ వెల్లడించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించి కేటాయించిన స్థలాన్ని వాస్తు సిద్ధాంతితో కలిసి పరిశీలించారు. భవన నిర్మాణానికి సంబంధించి భూమి కొలతలు తీసుకున్నారు.